

# అవును.. నోటీసులు నిజమే

- రూ.1.40 కోట్లు దుర్వినియోగం అయినట్లు నిర్ధారణ
- ఇద్దరు సర్పంచులు, ముగ్గురు కార్యదర్శులకు సంజాయిషీ నోటీసులు
- 15 రోజుల్లో వివరణ ఇవ్వకపోతే చర్యలు తప్పవు
- వెల్లడించిన పీలేరు ఎంపీడీవో, ఇన్‌చార్జ్ ఈవో

పీలేరు, ఆగస్టు 6: పీలేరు గ్రామ పంచాయతీకి చెందిన నిధుల దుర్వినియోగంపై ఇద్దరు సర్పంచులు, ముగ్గురు కార్యదర్శులకు సంజాయిషీ నోటీసులు జారీ చేసిన విషయం నిజమేనని నిర్ధారణ అయింది. వారికి నోటీసులు జారీ అయినట్లు పీలేరు ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి, పీలేరు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ ఈవో గురుమోహన్ తెలిపారు. వారు పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి పంచాయతీ నిధులలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణకు ఆదేశించారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం జూన్ 5వ తేదీ నుంచి పంచాయతీలో విచారణ ప్రారంభించిందన్నారు. సుమారు 20 రోజుల విచారణ అనంతరం వారు నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారన్నారు. వారి విచారణలో సెలవులో ఉన్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ప్రస్తుతం ఇన్‌చార్జ్ సర్పంచ్ జీనత్ షఫీ హయాంలలో రూ.1.40 కోట్ల మేర నిధులు దుర్వినియోగం అయినట్లు నిర్ధారించారన్నారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు వారితో పాటు వారి హయాంలో పీలేరు పంచాయతీ ఈవోలుగా పనిచేసిన జేఎల్‌ఆర్‌వీ ప్రసాద్ (ప్రస్తుతం చిత్తూరు జిల్లా సదుం మండల ఈవోపీఆర్‌ఆర్‌డీగా పనిచేస్తున్నారు), కేఆర్ ప్రసాద్ (ప్రస్తుతం వాల్మీకిపురం గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్నారు), ఎస్‌పి గఫూర్ (ప్రస్తుతం కేవీపల్లె మండలం ఈవోపీఆర్‌ఆర్‌డీగా పనిచేస్తున్నారు) ఆయా నిధుల వినియోగానికి సంబంధించిన సరైన రికార్డులతో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, వివరణ ఇవ్వకపోతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని వారు వెల్లడించారు. సెలవులో ఉన్న సర్పంచ్ హబీబ్ బాషా అందుబాటులో లేకపోవడంతో ఆయనకు ఫోను ద్వారా నోటీసులు జారీ చేశామని, మిగిలిన వారికి వ్యక్తిగతంగా నోటీసులు అందించినట్లు తెలిపారు. 2021-23 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన నిధుల వినియోగంపై విచారణ జరిపినట్లు వారిద్దరు తెలిపారు.

### అనుచరులకు రూ.31 లక్షల జీతాలు

అధికారుల విచారణలో పీలేరు పంచాయతీలో జరిగిన పలు విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. ఇద్దరు సర్పంచులు తమ అనుచరుల కోసం పంచాయతీ నిధులను ఇబ్బడి ముబ్బడిగా వాడుకున్న వైనం వెలుగు చూసింది. వారిద్దరూ గత మూడేళ్లకు రూ.31.20 లక్షల నిధులను తమ అనుచరులకు జీతాలుగా చెల్లించారు. పీలేరు గ్రామ పంచాయతీలో అనుమతి పొందిన వర్కర్లు 71 మంది ఉండాల్సి ఉండగా అదనంగా 52 మందిని నియమించుకున్నట్లు తెలిసింది. ఆ 52 మంది నియామకానికి అటు పంచాయతీ తీర్మానం గానీ, ఉన్నతాధికారుల అనుమతులు గానీ లేవని తెలిసింది. ఎటువంటి నిబంధనలు పాటించకుండా కొంతమంది వైసీపీ నాయకులు, తమ వద్ద పనిచేసే కొంతమందికి పంచాయతీ నిధుల నుంచి జీతాలు చెల్లించినట్లు విచారణలో తేలింది. వారికి జరుగుతున్న చెల్లింపులపై ఆరోపణలు రావడంతో తాను బాధ్యతలు చేపట్టిన తరువాత 20 మంది పేర్లను తొలగించినట్లు ఇన్‌చార్జ్ ఈవో గురుమోహన్ తెలిపారు. మిగిలిన వారిని కూడా వారి అర్హతను బట్టి పంచాయతీలో కొనసాగించాలా లేక తీసేయాలా అన్నది ఆలోచిస్తామన్నారు.

### అన్నింటా నిబంధనలు పక్కన పెట్టి...

ప్రస్తుత పాలకవర్గం నిబంధనలన్నింటినీ పక్కనపెట్టి తమ ఇష్టారీతిన పనులు చేపట్టడం, బిల్లులు చెల్లించడం జరిగిందని అధికారులు తేల్చారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో అధికారులు విచారించిన మొత్తం 39 అంశాలలో ఏ ఒక్కదానికి కూడా ఎటువంటి ముందస్తు అనుమతులు తీసుకోలేదని, చేసిన పనులకు ఎం.బుక్కులు సరిగ్గా రికార్డు చేయలేదని అధికారులు కనుగొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పరిశీలించిన 32 అంశాలు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో పరిశీలించిన 44 అంశాలకు కూడా ఎటువంటి ముందస్తు అనుమతులు లేవని అధికారుల విచారణలో తేలింది. పంచాయతీకి నిత్యావసరాలైన పారిశుధ్య, విద్యుత్ పరికరాల సరఫరా వంటి కీలక అంశాల్లోనూ ఎటువంటి నిబంధనలు పాటించలేదని అధికారులు కనుగొన్నారు. ఆయా సంవత్సరాల్లో పంచాయతీ పరిధిలో వేసిన సిమెంటు రోడ్ల నాణ్యత, పరిమాణాన్ని నిర్ధారించేందుకు పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈకి, సురక్షిత తాగునీరు పైపులైన్లను పరిశీలించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈకి, కొనుగోలు చేసిన వాటికి సమర్పించిన బిల్లులు పరిశీలించేందుకు జీఎస్‌టీ, సేల్స్ ట్యాక్స్ అధికారుల సాయం తీసుకుంటున్నట్లు ఎంపీడీవో, ఇన్‌చార్జ్ ఈవో తెలిపారు.

**ఎవరి హయాంలో ఎంతెంత...**

- అధికారులు వెల్లడించిన మేరకు సెలవులో ఉన్న సర్పంచు హబీబ్‌బాషా, కార్యదర్శులు జేఎల్‌ఆర్‌వీ ప్రసాద్, కేఆర్ ప్రసాద్‌ల హయాంలో రూ.80,74,184 దుర్వినియోగం అయినట్లు విచారణలో తేలింది.
- ప్రస్తుత సర్పంచు జీనత్ షఫీ, కార్యదర్శులు కేఆర్ ప్రసాద్, ఎస్‌పి గఫూర్‌ల హయాంలో రూ.59,69,530 దుర్వినియోగం అయినట్లు విచారణలో తేలింది.



పీలేరులో విలేఖరులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి, ఈవో గురుమోహన్

## మాజీ ఎమ్మెల్యే భూములనే కొట్టేశారు

- నకిలీ పాస్‌పుస్తకాలతో కబ్జా
- సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు
- ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అనుచరుడిపై ఆరోపణ



విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కుమారుడు అలూరి సుబ్రమణ్యం

మదనపల్లెటౌన్, ఆగస్టు 6: సామాన్య మధ్యతరగతికి చెందిన ప్రజల ఆస్తులను, భూములను కబ్జా చేయడంలో రాటుదేలిన వైసీపీ నాయకులు ఏకంగా మాజీ ఎమ్మెల్యే కుటుంబీకుల భూములకే మస్కా కొట్టి కాజేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలానికి చెందిన బాధితులు అలూరి సుబ్రమణ్యం, అలూరి సుధాకర్ బాబు మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు తమ భూముల కబ్జా విషయమై ఫిర్యాదు చేశారు. మదనపల్లె నియోజకవర్గం ఏర్పడక మునుపు గట్టు నియోజకవర్గం ఉండేది. ఈ నియోజవర్గానికి 1972 సంవత్సరంలో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గట్టు నరసింగారావు అలియాస్ అలూరి నరసింగారావుకు వంశపారంపర్యంగా గట్టు గ్రామంలో భూములు ఉన్నాయి. ఆయన అనంతరం నరసింగారావు కుమారులు అలూరి సుబ్రమణ్యం (టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు), అలూరి సుధాకర్‌బాబుల అనుభవంలో 75 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. ఈ క్రమంలో ఈ భూములపై కన్నుపడ్డ బి.కొత్తకోట వైసీపీ నాయకుడు టి.అమరనాథ్, వై.శివ అనే ఇద్దరు బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో నకిలీ పాసుపుస్తకాలు సృష్టించి పలు సర్వే నెంబర్లలోని భూములను వారి పేర్ల మీద పాసుపుస్తకాలు చేయించుకున్నారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని అలూరి సుబ్రమణ్యం, సుధాకర్‌బాబు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు ఫిర్యాదు కాపీలను పంపారు. ఈ సందర్భంగా మంగళవారం గట్టులో అలూరి సుబ్రమణ్యం మాట్లాడుతూ వంశపారంపర్యంగా వచ్చిన భూములతో పాటు తమ పిత్రార్జితంగా వచ్చిన భూముల ఫల సాయాన్ని తమకు చెందకుండా అమరనాథ్ అతడి అనుచరులు దోచుకుతింటున్నారన్నారు. ఒకప్పుడు ప్రజలకు అన్ని విధాలా న్యాయం చేసిన తమ కుటుంబానికి చెందిన భూములనే వైసీపీ నాయకులు కబ్జా చేయడం చూస్తే వారి అరాచకాలకు అడ్డులేకుండా పోయిందన్నారు. తమలాంటి వారికే ఇలా కబ్జా బాధలు ఉంటే, నియోజకవర్గంలో వందలాది సామాన్య ప్రజల భూములు లాక్కోవడం చాలా బాధగా ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణ చేయించి బాధితులందరికీ సత్వరం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అలూరి సుబ్రమణ్యం కోరారు.

## రికార్డులు భద్రం

- ఏమైనా జరిగితే ఉద్యోగాలు పోతాయి
- రాజంపేట సబ్ కలెక్టర్ వైకోమ్ నిదియాదేవి



రికార్డులను పరిశీలిస్తున్న రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమ్ నిదియాదేవి

వీరబల్లి, ఆగస్టు 6: గతంలో ఉన్న రికార్డులన్నీ భద్రంగా ఉంచాలి. ఏమైనా అవకతవకలు జరిగితే ఉద్యోగాలు పోతాయని రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమ్ నిదియాదేవి తెలిపారు. మంగళవారం స్థానిక వీరబల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూములకు సంబంధించిన పలు రికార్డులను ఆమె పరిశీలించారు. రికార్డు గదులను జాగ్రత్తగా ఉంచుకుని ఖచ్చితంగా రికార్డు గదులకు తాళాలు వేసి జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామితో మాట్లాడారు. రెవెన్యూకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందని ఏమైనా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా పలు సమస్యలపై ప్రజలు నిత్యం కార్యాలయానికి వస్తుంటారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని డ్రైనేజీ సమస్యపై పలువురు ఆమె దృష్టికి తీసుకురావడంతో ఆమె వాటిని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గోపి, పలువురు వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న జేసీ

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి... జేసీ వాహనంలో ఆస్పత్రికి తరలింపు



ప్రమాద స్థలంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటిటౌన్, ఆగస్టు 6: రాయచోటి పట్టణంలోని కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదురుగా జాతీయ రహదారిలో పొత్తుకూరుపల్లెకు చెందిన రమేశ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెళుతూ డివైడర్‌కు ఢీకొట్టి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అదే సమయంలో కలెక్టర్ కార్యాలయంలో విధులు పూర్తి చేసుకుని నివాసానికి వెళుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ ప్రమాద సంఘటనను గుర్తించి అక్కడికి వెళ్లి గాయపడిన వ్యక్తి వివరాలు సేకరించి వారి బంధువులకు ఆయనే స్వయంగా ఫోన్ చేసి సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి అంబులెన్స్ రావడం ఆలస్యమవుతుందని గ్రహించి తన సొంత వాహనంలోనే ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వెంటనే సిబ్బంది జేసీ వాహనంలో రమేశ్‌ను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించగా రమేశ్‌కు వైద్య సేవలందించి కాలు ఫ్రాక్చర్ అయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ప్రమాద సంఘటనను గమనించి రమేశ్‌ను సకాలంలో తన సొంత వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందేలా మానవత్వం చాటుకున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు రమేశ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## నాటు తుపాకీతో కాల్చుకుని వ్యక్తి మృతి

- ఆర్థిక ఇబ్బందులు అనారోగ్యంతోనే...
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ, ఎస్ఐ



నాటు తుపాకీతో కాల్చుకుని చనిపోయిన రాజగోపాల్

సంబేపల్లె, ఆగస్టు 6: మండల పరిధిలోని నారాయణరెడ్డి గారిపల్లె గ్రామం తిరుమల రాయగుట్ట జగనన్న కాలనీ వద్ద మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో నాటు తుపాకీతో కాల్చుకొని రాజగోపాల్ (47) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.... చిన్నమండెం మండలం బోనమల గ్రామం కనకంటివారిపల్లెకు చెందిన రాజగోపాల్ తన కుటుంబంతో కలిసి రెండు సంవత్సరాల క్రితం జగనన్న కాలనీ వద్దకు వచ్చి ఇటుకలు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంతో ఇటీవలే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అనారోగ్యంతో పాటు ఆర్థిక బాధలు ఎక్కువై తాగుడుకు బానిసయ్యాడు. మంగళవారం ఉదయం నాటుతుపాకీ తెచ్చుకుని కుటుంబ సభ్యుల ఎదుటే కాల్చుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ తులసీరాం, ఎస్ఐ రామకృష్ణలు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మా భూముల పాసుపుస్తకాలే మార్చేశారు

- వైసీపీ నాయకులకు తొత్తులుగా మారిన అధికారులు
- సబ్ కలెక్టరేట్ వద్ద వృద్ధురాలు, కుటుంబీకుల ఆవేదన



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

మదనపల్లెటౌన్, ఆగస్టు 6: గుర్రంకొండ వైసీపీ నాయకులు, వారి అనుచరులు రెవెన్యూ అధికారులను లోబరచుకుని మా భూముల పాసుపుస్తకాలను వేరే వారి పేరు మీద మార్చేశారని గుర్రంకొండ మండలం అమిలేపల్లె పంచాయతీ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు సుబ్బమ్మ, ఆమె కుటుంబీకులు నాగేశ్వర, లక్ష్మీదేవిలు ఆరోపించారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్దకు వచ్చిన బాధితులు మాట్లాడుతూ సుబ్బమ్మ పేరిట ఖాతా నెంబర్ 716 పేరిట సర్వే నెంబర్ 348/8లో 3.15 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూమిని ఖాతా నెంబర్ 755తో ఇదే గ్రామానికి చెందిన అక్కయ్య పేరుతో రెవెన్యూ అధికారులు మార్చేశారన్నారు. వైసీపీ నాయకులకు తొత్తులుగా మారిన అప్పటి తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్‌వోలే కారణమని ఆరోపించారు. వైసీపీ నాయకులు మాపై దౌర్జన్యం చేస్తామని బెదిరించారన్నారు. దీనిపై అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. అంతేకాకుండా మా భూముల ఖాతా నెంబర్ విషయమై 2020 సంవత్సరం వాయల్పాడు కోర్టులో దావా వేసి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారన్నారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని సబ్ కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందించారు. కాగా గుర్రంకొండ మండలం రాయచోటి రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వస్తుందని, అక్కడికే వెళ్లి అర్జీ ఇవ్వాలని సబ్ కలెక్టరేట్ అధికారులు చెప్పడంతో బాధితులు వెనుతిరిగారు.

## వందలాది ఎకరాలు అన్యాక్రాంతం

- వెలమవారిపల్లె వద్ద కనుమరుగైన గుట్టలు
- భూ ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపిస్తాం
- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



కొండను పరిశీలిస్తున్న రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, ఆగస్టు 6: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కె.వెలమవారిపల్లె వద్ద రెండు జాతీయ రహదారుల మధ్యలో ఉన్న రూ.వందలకోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా భూబకాసురులు ఆక్రమించుకున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కె.వెలమవారిపల్లె గ్రామ సమీపంలో కబ్జాకు గురైన భూములను పరిశీలించి మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఈ ఆక్రమణల విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశానని, వీఆర్‌ఓ, ఆర్‌ఐలు కూడా పైఅధికారులకు విషయం తెలిపామని చెప్పారన్నారు. కానీ ఏరోజు కూడా అధికార యంత్రాంగం ఈ కొండల వైపుగాని ఈ భూముల వైపు గాని కన్నెత్తి తచూడకుండా కబ్జాదారులకు అండగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో ఏ విధంగా భూములను కబ్జాచేసి ఆక్రమించుకున్నామో ఇపుడు కూడా అదే విధమైన పంథాను కొనసాగించాలనే ఆలోచనతో కొంతమంది కబ్జాదారులు ఉన్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న కొండలు, గుట్టలన్నీ మాయమయ్యాయన్నారు. మిషన్లు, టిప్పర్లు పోలవరంలో కూడా పనిచేయలేదన్నారు.

అసైన్డ్ భూముల పంపిణీనే జరగలేదని, మున్సిపాలిటీ చుట్టూ ఐదుకిలోమీటర్ల వరకు ప్రభుత్వ భూములను ఇవ్వకూడదన్న ప్రభుత్వ నిబంధన ఉందన్నారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారులకు అంతా తెలిసినా ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశామని అంటున్నారు తప్ప ఆక్రమనల్ని అడ్డుకోలేన్నారు. ఏ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారో కలెక్టర్ దృష్టికి రెండు రోజుల్లోగా తీసుకెళ్లి ఈ ఆక్రమాలపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను నిగ్గు తేలుస్తామన్నారు.

2000 సంవత్సరం నుంచి పులివెందుల నియోజకవర్గంలో వెలమవారిపల్లె, వెంకటటాపురం గ్రామ పొలాల్లో నిరుపేద రైతులకు భూమిని పంపిణీచేసిన దాఖలాలు లేవన్నారు. ఒకవైపు మెడికల్ కళాశాల, మరోవైపు బెంగళూరు, అమరావతి ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న వందల కోట్లరూపాయల విలువైన వందల ఎకరాల భూములను కబ్జాచేశారన్నారు. ఆక్రమిత భూములను మళ్లీ ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చేలా చేస్తామన్నారు. పట్టణానికి ఇంత దూరంలో ఎటువంటి పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోయిన విద్యుత్‌శాఖ అధికారులు ఏ విధంగా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి మీటర్లకు అనుమతులు ఇస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వీటన్నిటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా మైసూరారెడ్డి, తాళ్లపల్లె వెంకటేశ్వర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌రెడ్డికి 59 మంది గన్‌మేన్లు చాలరా?

- తులసిరెడ్డి ఎద్దేవా

వేంపల్లె, ఆగస్టు 6: ప్రస్తుతం తనకు 59మంది గన్‌మేన్లను ప్రభుత్వం ఇచ్చింది, వారు చాలరు, 139మంది గన్‌మేన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించండి అని జగన్ హైకోర్టులో పిటీషన్ వేయడం హాస్యాస్పదమని రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో మంగళవారం ఆయన మాట్లాడుతూ జగన్ పిరికితనానికి ఇది దర్పణమన్నారు. అయినా 59మందిని ఇవ్వడమే తప్పు అన్నారు. అందరు ఎమ్మెల్యేల లాగా జగన్ కూడా ఒక ఎమ్మెల్యే మాత్రమే అన్నారు. ఎమ్మెల్యేలకు 1+1 గాని, 2+2గానీ గన్‌మేన్లను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అలాగే జగన్‌కు కూడా కల్పించాలన్నారు. జగన్ 139 మంది కావాలని అడుగుతున్నది భద్రత కోసం కాదు, స్టేటస్, హంగు, ఆర్భాటం కోసమన్నారు. ప్రతిపక్ష నాయకుని హోదా కోసం జగన్ హైకోర్టులో పిటీషన్ వేయడం విడ్డూరమన్నారు. ప్రతిపక్షనాయకుని హోదా ఇవ్వాలంటే అసెంబ్లీలో ఎమ్మెల్యేల మొత్తం సంఖ్యలో పదిశాతం ఆ పార్టీకి ఉండాలని నిబంధనలను చెబుతున్నాయన్నారు. వైసీపీ ఎమ్మెల్యేల సంఖ్య 11 మాత్రమే కాబట్టి రాలేదన్నారు. వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డి లాంటి వారు కేవలం ఎమ్మెల్యే హోదాలో రాణించలేదా అని ప్రశ్నించారు. చాక్లెట్ ఇస్తే బడికి పోతా లేకుంటే పోను అని చిన్నపిల్లలు మారాం చేసినట్టుంది జగన్ వైఖరి అన్నారు.

## లోకేశ్ చొరవతో... నరకం నుంచి విముక్తి



సౌదీలోని భారత ఎంబసీ వద్ద హసీనా

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి) : ఉపాధి కోసం ఎడారి దేశానికి వచ్చి ఇబ్బందులను ఎదుర్కొంటున్న అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం తుర్కపల్లె గ్రామానికి చెందిన షేక్ హసీనా (25) తనను రక్షించాలంటూ మంత్రి నారా లోకేశ్‌కు సామాజిక మాధ్యమాల ద్వారా చేసిన విన్నపం ఫలించింది. ఈ మేరకు సౌదీ అరేబియాలోని ఏపీ ఎన్నార్టీ ప్రతినిధి, చిత్తూరు జిల్లా సోమల మండలం కందూరుకు చెందిన చిట్టలూరి రంజిత్ మంగళవారం హసీనాను మరో ప్రతినిధి ముజ్జమ్మిల్‌షేక్ సహాయంతో రియాద్ నగరంలో సురక్షితంగా భారతీయ ఎంబసీ అధికారులకు అప్పగించారు. గత కొన్ని రోజుల నుంచి సరిగ్గా తిండిలేక నీరసించిపోయిన ఆమెకు భోజన ఏర్పాట్లు చేయించి కొంత నగదు అందించారు. హసీనాను సురక్షితంగా చేర్చిన విషయాన్ని తెలుగుదేశం పార్టీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణతో పాటు విజయవాడలోని ఏపీ ఎన్నార్టీ అధికారులకు వారు తెలియజేసారు. అక్కడి ప్రభుత్వ అధికారుల సహాయంతో ఆమె వీసాను రద్దు చేసి స్వదేశానికి పంపించడానికి ఎంబసీ అధికారులు ప్రయత్నిస్తారని రంజిత్ చెప్పారు.

## వేగవంతంగా ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియ

- జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 6: ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని డైట్ స్కూల్ హాల్‌లో జిల్లా ఓపెన్ స్కూల్ ఏఏఐ కోఆర్డినేటర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పరీక్షల ద్వారా 14 సంవత్సరాలు దాటిన వారు, పదో తరగతి ఫెయిల్ చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి చదువుకునే అవకాశం ఉందన్నారు. అలాగే ఇంటర్ చదువుకోవాలనుకున్న 15 సంవత్సరాలు నిండిన, ఇంటర్ ఫెయిల్ అయి మధ్యలో చదువు మానేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్స్ రాష్ట్ర పరిశీలకుడు అక్బర్‌అలీ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ చదివే వారికి సెలవు రోజుల్లో తరగతులు ఉంటాయని, ప్రభుత్వమే సరళమైన భాషలో స్వీయ బోధన కోసం తయారు చేసిన పుస్తకాలు అందజేస్తుందన్నారు. అలాగే మహిళలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులతో పాటు మాజీ సైనికోద్యోగులకు అడ్మిషన్ ఫీజులో రాయితీ ఉంటుందన్నారు. అభ్యాసకులు ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందినప్పటి నుంచి ఐదు సంవత్సరాలలోపు 9 పర్యాయాలు పరీక్షలకు హాజరయ్యే సౌలభ్యం ఉందన్నారు. జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200తో పాటు అడ్మిషన్ ఫీజు జనరల్ కేటగిరి అభ్యర్థులకు రూ.1400, మహిళలు ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మాజీ సైనిక ఉద్యోగులకు రూ.900 ఉంటుందన్నారు. అలాగే అడ్మిషన్ ఫీజు రాయితీ పొందే వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే వారికి ప్రతి సబ్జెక్టుకు రూ.100 పరీక్ష ఫీజు ఉంటుందని, దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష ఫీజులో రాయితీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐఈడీ కోఆర్డినేటర్ జనార్ధన్, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ మాట్లాడారు.




ఓపెన్ స్కూల్ పరీక్షల ప్రచార కరపత్రాలు విడుదల చేస్తున్న డీఈవో, అబ్జర్వర్, డిస్ట్రిక్ కోఆర్డినేటర్లు

## కోడూరుకు చేరుకున్న ఉపేంద్రవర్మ మృతదేహం


మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, బంధువులు, ఉపేంద్రవర్మ (ఫైల్)

రైల్వేకోడూరు, ఆగస్టు 6: విశాఖ పరిధిలోని హుకుంపేట నియోజకవర్గం గడుగుపల్లె వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వేకోడూరు మండలం ఎస్‌ఆర్ కండ్రిక గ్రామానికి చెందిన చమర్తి ఉపేంద్రవర్మ మృతి చెందిన విషయం తెలిసిందే. శవపరీక్ష అనంతరం మంగళవారం అతడి సొంత గ్రామానికి మృతదేహం చేరుకుంది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఉపేంద్రవర్మ మృతితో ఎస్‌ఆర్ కండ్రిక గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. తల్లిదండ్రులు, భార్య, పిల్లలు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. రాజకీయ ప్రముఖులు ఉపేంద్రవర్మ బంధువులను పరామర్శించారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

కాశినాయన ఆగస్టు 6: అమగంపల్లె సమీపంలోని రామచంద్రాపురం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నరసింహులు (25) అనే యువకుడు కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు... పోరుమామిళ్ల మండలంలోని చిన్నఎర్రసాలకు చెందిన ఎర్రంశెట్టి తిరిపేలయ్య కుమారుడు ఎర్రంశెట్టి నరసింహులు బ్రహ్మంగారిమఠం వెళ్లి పనిముగించుకొని తిరిగి పోరుమామిళ్లకు వస్తుండగా మైదుకూరు-పోరుమామిళ్ల ప్రధాన రహదారిపై రామచంద్రాపురం వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆ యువకుడిని చికిత్స కోసం మొదట పోరుమామిళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## కేసు కొట్టివేత

కమలాపురం రూరల్, ఆగస్టు 6 : కమలాపురం రైల్వేస్టేషన్‌లో అన్ని రైళ్లు ఆపాలని స్థానిక రైల్వే గేటు వద్ద చేసిన రైల్‌రోకోతో కమలాపురం ప్రజాప్రతినిధులపై రైల్వే పోలీసులు నమోదు చేసిన కేసును మంగళవారం విజయవాడలోని వీఐపీ కోర్టు కొట్టివేసింది. కరోనా కారణంగా కమలాపురం రైల్వేస్టేషన్‌లో ఆపేసిన అన్ని రైళ్లకు స్టాపింగ్ ఏర్పాటు చేయాలని, 2022 జనవరి 10న అప్పటి కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో కమలాపురం రైల్వేగేటు వద్ద రైల్‌రోకో చేశారు. అప్పటి ఎమ్మెల్యేలు రవీంద్రనాథరెడ్డి, రఘురామిరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, హార్టికల్చర్ స్టేట్ అడ్వయిజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, కమలాపురం మున్సిపల్ చైర్మన్ మేరీలపై కేసు నమోదు చేశారు. దాదాపు రెండున్నరేళ్ల పాటు కేసు విచారణ అనంతరం విజయవాడలోని వీఐపీ కోర్టు ఈ కేసును కొట్టివేసింది.

## మద్యం సీసాలు ధ్వంసం

మద్యం సీసాలతో పోలీస్ సిబ్బంది


రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 6: నియోజకవర్గ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 688 మద్యం సీసాలను రాయచోటి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో అందజేసి అనంతరం డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు రైల్వేకోడూరు సెబ్ ఎస్‌ఐ భాస్కర్ తెలిపారు. ఎన్నికల కోడ్ సమయంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని 66 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మద్యం విలువ రూ.90 వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కె.ప్రసాద్, డి.రామచంద్ర, వి.రవి తదితరులు పాల్గొన్నారు.

## గుప్త నిధుల కోసం...


విగ్రహం ముక్కును పగలకొట్టిన దృశ్యం

కొండాపురం, ఆగస్టు 6: మండలంలోని ముంపునకు గురైన పాత తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు చెన్నకేశవ స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. గండికోట ప్రాజెక్టుకు నీళ్లు తగ్గడంతో పాత గ్రామంలోకి వెళ్లి ఈ ఆలయంలో రోజు పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం పూజరి గుడిలోకి వెళ్లే సరికి చెన్నకేశవస్వామి విగ్రహం ముక్కును పగలగొట్టినట్లు గుర్తించినట్లు తెలిపారు. చెన్నకేశవస్వామి ఆలయం అతిపురాతనమైనదని, జనమేజయుడనే రాజు కాలంలో నిర్మించినట్లు స్థానికులు తెలిపారు.గుప్తనిధుల కోసమా లేదా ఉద్దేశ్యపూర్వంగా ఎవరైనా విగ్రహాన్ని పగలగొట్టారా అన్నది తెలియాల్సి ఉంది.

## గిరి ప్రదక్షిణకు రహదారి ఏర్పాటు

ఒంటిమిట్ట, ఆగస్టు 6: కోదండరాముని గిరి ప్రదక్షిణ కోసం సీఐ పురుషోత్తమరాజు రహదారిని ఏర్పాటు చేశారు. కోదండరాముని గిరి ప్రదక్షిణకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యేందుకు వీలుగా ప్రచారం నిర్వహించడంతో పాటు భక్తులకు అనుగుణంగా ఉండేందుకు రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించామని ఆయన అన్నారు. కోదండరామాలయం నుంచి పెద్దకొత్తపల్లె, చిన్నకొత్తపల్లె, గంగపేరూరు చెరువు కట్టవెంబడి రాచగుంటపల్లె, రాచపల్లె, సాలాబాదు, మలకాటిపల్లె మీదుగా కోదండరామాలయానికి గిరి ప్రదక్షిణ జరుగుతుందన్నారు. ఈనెల 19వ తేదీ సోమవారం ఉదయం పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ నిర్వహించాలని స్థానికులు, భక్తుల కోరిక మేరకు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

## వైవీయూలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 6 : వైవీయూలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని, దీనిపై విద్యాశాఖ మంత్రి తక్షణం స్పందించాలని ఆర్వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్వీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైవీయూ పరిధిలో కడప నగరంలో రెండు ప్రైవేటు న్యాయ కళాశాలలు ఉన్నాయన్నారు. ఈ కళాశాలల్లో వేల మంది విద్యార్థులు ఏపీతో పాటు తమిళనాడు ఇతర రాష్ట్రాల వారు కూడా అడ్మినషన్లు తీసుకుంటున్నారన్నారు. పేరుకు అడ్మిషన్లు పొందారని కళాశాలల్లో ఎటువంటి తరగతులు నిర్వహించలేదన్నారు. ప్రతిసారి న్యాయవిద్య పరీక్ష ఫలితాల్లో కేవలం 20 మంది ఉత్తీర్ణత కావడం అన్యాయమన్నారు. వేల మంది లక్షల రూపాయలు కట్టి ఎన్నిసార్లు పరీక్షలు రాసినా ఫలితం శూన్యమన్నారు. రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాల్లో న్యాయ కళాశాల ఉన్నందున వైవీయూలో కూడా న్యాయ కళాశాల పెడితే న్యాయమైన విద్య అంది ఫెయిల్ పర్సంటేజీ తగ్గుందన్నారు. ఉన్నత విద్యా మండలి, విద్యాశాఖ మంత్రి దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్వీఎస్ నాయకులు భార్గవరెడ్డి, అరవింద్, విష్ణు పాల్గొన్నారు.

## ఈవో సర్వీసు వ్యవహారాన్ని మీరు ప్రశ్నించలేరు

### ప్రైవేటు వ్యక్తికి స్పష్టం చేసిన హైకోర్టు

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖలో పనిచేసే ఉద్యోగి సర్వీసు వ్యవహారానికి సంబంధించి ఆ శాఖతో సంబంధం లేని ప్రైవేటు వ్యక్తి ప్రశ్నించలేరని హైకోర్టు తేల్చిచెప్పింది. దేవదాయశాఖ పరిధిలోని ప్రొద్దుటూరు శ్రీ కృష్ణగీత ఆశ్రమం ఈవో శంకర బాలాజీకి కడప జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించడాన్ని సవాల్ చేస్తూ పిటిషనర్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదని స్పష్టం చేసింది. పిటిషనర్ శ్రీ కృష్ణగీత ఆశ్రమంలో ఏ హోదాలోనూ విధులు నిర్వర్తించడం లేదని గుర్తుచేసింది. లీజు హక్కులు, చెల్లింపులు విషయంలో ఏమైనా అభ్యంతరం ఉంటే సంబంధిత వేదికను ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పును ఉదహరిస్తూ... పిటిషనర్‌కు ప్రస్తుత పిటిషన్ వేసే అర్హత లేదంది. వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ ఇటీవల తీర్పు ఇచ్చింది. శ్రీ కృష్ణగీత ఆశ్రమం ఈవోగా పనిచేస్తున్న శంకర బాలాజీకి, కడప జిల్లా దేవదాయ సహాయ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ ఆశ్రమం స్థలాన్ని లీజుకు తీసుకొని కళాశాల నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ ఎం.సురేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం... లీజు బకాయిల విషయంలో దేవాదాయశాఖ, పిటిషనర్ మధ్య సివిల్ వివాదం నడుస్తోందని గుర్తుచేసింది. ఆశ్రమంతో సంబంధం లేని వ్యక్తి, ఈవో సర్వీసు వ్యవహారాన్ని సవాల్ చేయలేరని స్పష్టం చేసింది. అందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు ఉందని పేర్కొంటూ ఈ వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

# భూమి ఏదైనా.. ఎకరం రూ.30 వేలు..!

- అడ్డగోలుగా భూముల ఆన్‌లైన్
- గత ప్రభుత్వంలో బరి తెగించిన రెవెన్యూ అధికారులు
- కొండలు, చెరువులు గుట్టలు సైతం వదలని వైనం


కొండను చదును చేసి ఏర్పాటు చేసిన కంచె

బి.కోడూరు, ఆగస్టు 6: సాగు చేసుకుంటున్న పొలాలు తమవే అనేందుకు రైతుల వద్ద పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉండేవి. అనంతరం వాటిని ఆన్‌లైన్ చేస్తూ వచ్చారు. అయితే గత ప్రభుత్వంలో సాగు చేయకపోయినా భూములు అడ్డగోలుగా ఆన్‌లైన్ చేయించుకుని ఎకరాలకు ఎకరాలు సొంతం చేసుకున్నారు. అవి కొండలైనా, గుట్టలైనా చెరువులు అయినా వదల్లేదు. ఏకంగా కొండలకే కంచెలు వేశారు. చెరువులకు గుట్టలకు కంచెలు వేసి పండ్లచెట్లు నాటుతున్నారు. గత ప్రభుత్వంలో బి.కోడూరు మండలంలో ప్రభుత్వ స్థలమైనా, కొండైనా గుట్టలైనా, చెరువులైనా పిత్రార్జిత భూములు అయినా సరే.. ఎకరంకు రూ.30వేలు ఇస్తే చాలు అడ్డగోలుగా ఆన్‌లైన్ చేశారు. ఇలా ఎకరాలకు ఎకరాలు ఎలాంటి రికార్డులు లేకపోయినా ఆన్‌లైన్‌లో ఎక్కించేశారు. వీటిని అరికట్టేందుకు ఏ అధికారి చొరవ చూపకపోవడం శోచనీయం.

భూముల ధరలు రానురాను అమాంతం పెరగడంతో బద్వేలు-పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాలన్నీ స్థానికేతరుల చేతుల్లోకి వెళ్లాయి. వారు ఒక అడుగు ముందుకు వేసి కొండతూర్పున కొండ సగభాగానికి కంచెలువేశారు. అవన్నీ కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని ఏకంగా చెట్లను నాటేశారు. బద్వేలు నుంచి పోరుమామిళ్ల వెళ్లే ప్రయాణికులు దీనిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఎక్కడాలేని విధంగా బి.కోడూరు మండలంలో రెవెన్యూ వారు అవినీతికి పాల్పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### కొండలు, చెరువులు, గుట్టలు ఆన్‌లైన్

మండలంలో రెవెన్యూ అధికారులు ఒక అడుగు ముందుకు వేసి కొండలు, గుట్టలు, చెరువుతట్లను డబ్బులు తీసుకుని విచ్చలవిడిగా ఆన్‌లైన్‌లో ఎక్కించారు. గతంలో కొండలు, గుట్టలు, చెరువు తట్లు సాగు చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చే వారు కాదు. అవన్నీ గొర్లు, మేకలు, పశువులు మేపుకునేందుకు వాడుకునేవారు. బి.కోడూరు మండలంలో గతంలో దాదాపు 8వేల గొర్లు, నాలుగువేల మేకలు, 12వేల పశువులు ఉండేవి. ఇవన్నీ మేపుకునేందుకు కొండలు, గుట్టలు, చెరువుతట్లు ఉండేవి. ప్రస్తుతం ఈ భూములన్నీ అన్యాక్రాంతం కావడంతో.. మేపుకోను బీడు భూములు లేక గొర్లు, మేకలను రైతులు అమ్మేసుకున్నారు. కనీసం కొండకు వెళ్లి పశువులను, గొర్రెలను మేపుకుందామంటే దారులు కూడా లేవని రైతులు వాపోతున్నారు. కొండచుట్టూ కంచెలు వేసేశారని అంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు పరిశీలించి కొండలు, చెరువుతట్లు, గుట్టలకు ఉన్న కంచెలు తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. భూములు ఆన్‌లైన్ చేసిన విషయం, కొండలకు కంచె వేసిన విషయమై తహసీల్దారును వివరణ కోరగా, వాటన్నింటినీ పరిశీలించి కంచెలు తొలగిస్తామని అన్నారు.

### అడ్డగోలుగా భూముల ఆన్‌లైన్

ఓ రైతుకు పిత్రార్జితం భూమి ఉంది. ఇతను తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆన్‌లైన్ చేయాలని అడిగితే.. ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలని కండీషన్ పెట్టారు. రైతు మా పొలం ప్రభుత్వ భూమి కాదు పిత్రార్జిత భూమి, అనువంశిక భూమి, మా భూమి మాకు ఆన్‌లైన్‌లో ఎక్కించండి అని మొరపెట్టుకున్నా రెవెన్యూ అధికారులు అప్పట్లో లెక్కచేయలేదు. ప్రభుత్వం అయితేనేం అనువంశికమైతేనేమి మాకు ఎకరాకు రూ.30వేలు ఇవ్వాల్సిందేనని చెప్పారు. అప్పట్లో రైతులు ఎంత మొరపెట్టుకున్నా, ఉన్నతాధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో.. చివరకు డబ్బులు ఇచ్చి ఎవరి భూమిని వారు ఆన్‌లైన్ చేయించుకోవాల్సి వచ్చింది.

## ఎస్‌పీఏతో వైఎస్‌ఆర్ ఏఎఫ్‌ఏయూ ఎంఓయూ


ఎంఓయూ కుదుర్చుకుంటున్న వైస్ చాన్సలర్ విశ్వనాథకుమార్, కొండారమేశ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 6 : భారత ప్రభుత్వ సంస్థ అయిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ) మార్గదర్శకంలో కడప వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ డైరెక్టర్ కొండారమేశ్ ఆధ్వర్యంలో ఏఎఫ్ఏయూ వైఎస్ చాన్సలర్ విశ్వనాథకుమార్ ఐదు సంవత్సరాల పాటు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా విశ్వనాథకుమార్ మాట్లాడుతూ అకడమిక్ అంశాలతో పాటు పరిశోధనకు సంబంధించిన కార్యకలాపాల్లో రెండు సంస్థలు కలిసి పనిచేస్తాయన్నారు. కన్సల్టెంట్ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి యూజీ, పీజీ కోర్సుల్లో సహకారం అందించేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో భాగస్వామ్య విద్యార్థులకు మెటీరియల్ వెబ్‌నార్లు ఉపన్యాసాలు విద్యార్థుల జ్ఞానమార్పిడి నైపుణ్య సంబంధిత అంశాలపై ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్కిటెక్చర్ డాక్టర్ జనమేజాయిగుప్త, డీన్ పరిశోధన కన్సల్టెంట్ డాక్టర్ అమితవసర్కార్, డీన్ ఫ్యాకల్టీ వెల్ఫేర్ వైఎస్ఆర్ ఏఎఫ్ఏయు కడప ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

## కుట్రలకు పాల్పడితే ఎవరినీ వదలం : చమర్తి


మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, ఆగస్టు 6 : కుట్రలు కుతంత్రాలకు పాల్పడితే వైసీపీ నేతలను వదలబోమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీల్లో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని టీడీపీ ముద్ర వేసి తొలగించారన్నారు.

మున్సిపాలిటీ పరిధిలో పనిచేసినవారి పేర్లు ఆన్‌లైన్‌లో ఉండడంతో వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని అడిగేందుకు టీడీపీ నేతలు వెళ్లారన్నారు. బాధితుల పక్షాన ప్రశ్నించినందుకు.. వైసీపీ నేతలు కావాలనే రాద్ధాంతం చేశారన్నారు. బాధితుల పక్షాన మాట్లాడటం తప్పా అని ప్రశ్నించారు. ఉద్యోగం కోల్పోయిన వారిలో ఎస్సీ వర్గానికి చెందిన వారు కూడా ఉన్నారని, నేడు నిరసన చేసిన దళిత సోదరులకు తెలియదా.. ఏరోజు అయినా వారి పక్షాన మాట్లాడారా.. అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు కుట్రపూరిత ఆలోచనలు మాని ప్రజల పక్షాన పనిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొమరా వెంకటసుబ్బయ్య, గన్నే సుబ్బ నరసయ్య, సుబ్రమణ్యం నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : బీటెక్ రవి


అన్నక్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఆగస్టు 6: అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఉన్న బీటెక్ రవిని కలిసేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. తమ సమస్యలను చెప్పుకొన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

అనంతరం పులివెందుల నాలుగురోడ్ల కూడలిలో అన్నక్యాంటీన్ పనులను పరిశీలించారు. ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్నక్యాంటీన్లను ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు రూ.5కే భోజనం అందించడం జరుగుతుందని, పులివెందులకు పలు ప్రాంతాల నుంచి వచ్చే పేద ప్రజలకు అన్నక్యాంటీన్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రక్త సేకరణ నిధిలో అన్నమయ్య జిల్లా ముందుండాలి

- మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్


రక్తదాతను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

కలికిరి, ఆగస్టు 6: దాతల నుంచి సేకరించి భద్రపరిచే రక్తనిధిలో అన్నమయ్య జిల్లా ముందంజలో ఉండాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆకాంక్షించారు. వాతావరణ ఒడిదుడుకుల ప్రభావంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జబ్బులు విస్తరిస్తున్న దృష్ట్యా రక్తం అవసరం ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. రక్తదానం గురించి అపోహలు తొలగించుకోవాలని, యువత రక్తదానం చేయడానికి ప్రతిజ్ఞ చేపట్టాలని సూచించారు. విద్యార్థులంతా ముందుకొచ్చి రక్తదానానికి సహకరిస్తే రక్త కొరత లేని జిల్లాగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సబ్ కలెక్టర్ ప్రారంభించారు. రక్తదానం కోసం ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. తరచూ ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేసి రక్త సేకరణకు పూర్తి సహకారం అందజేస్తామని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర రావు హామీ ఇచ్చారు. విద్యార్థులు టాటూలకు దూరంగా ఉంటేనే రక్తదానానికి అవకాశముంటుందని చెప్పారు. రక్తదాతలు ప్రాణ దాతలుగా అభివర్ణించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో

పెద్దతిప్పసముద్రం అగస్టు 6 : సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కొండయ్య వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఆసుపత్రి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, గర్భిణులు, బాలింతలకు, విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి గ్రామాల్లో పౌష్టికాహారంపై విస్తృతంగా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు.

## ఆరుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు

మదనపల్లె అర్బన్, ఆగస్టు6: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ ఎన్ శేఖర్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... మదనపల్లె మండలం కొత్తయిండ్లు రంగారెడ్డి కాలనీకి చెందిన పఠాన్ నజియా సుల్తానా (35)ను ఆమె భర్త నూర్ అహమ్మద్‌తో పాటు అతడి కుటుంబసభ్యులు వరకట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారంటూ బాధితురాలు తాలుకా పోలీసులను ఆశ్రయించింది. తన భర్త ఆటోమొబైల్ షాపులో పనిచేస్తున్నాడని లక్ష రూపాయలు కట్నం తెవాలని హింసకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసుల విచారణ చేసి భర్త నూర్ అహమ్మద్, అత్త జరీనా, ఆడపడుచులు నస్రీంతాజ్, మెరినాతాజ్, రోహినీ తాజ్, అవ్వ జమ్రుద్దీన్‌బీపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### హత్య కేసులో ముగ్గురికి రిమాండ్

యువతిని కొట్టి హత్య చేసిన కేసులో ముగ్గురిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ శేఖర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు గత నెల 24వ తేదీ నీరుగట్టువారిపల్లె సమీపంలోని బాబుకాలనీలో సాయిప్రియాంకను అత్తంటివారే హత్య చేశారని సాయిప్రియాంక అమ్మ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన అనంతరం భర్త మణికంఠ, అత్త ఉషారాణి, మామ శ్రీనివాసులను రిమాండ్‌కు తరలించామని తాలుకా సీఐ చెప్పారు.

### సవరణ

ఆంధ్రజ్యోతిలో 3-8-2024 కడప ఎర్రముక్కపల్లె చౌడేశ్వరి దేవి ఓరియంటల్ & జనరల్ హైస్కూల్ వారి ఉద్యోగ ప్రకటన దరఖాస్తు చివరితేది 10-9-2024 ప్రచురించినారు. కాని చివరి తేది 14-8-2024 చదువుకొనగలరు.

కరస్పాండెంట్

## పంట నమోదు తప్పనిసరి



ఈక్రాప్ బుకింగ్ చేయిస్తున్న తహశీల్దారు మురాషావలి

సిద్దవటం, ఆగస్టు 6: రైతులు పండించిన ప్రతి పంటకు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. మండలంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిరైతు రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రతిరైతు సాగు చేసిన పంటను ఈ-పంట నమోదు చేస్తేనే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, సమ్మాన్ నిధి, పంటనష్టపరిహారం, ఇన్‌ఫుట్ సబ్సిడీ, సబ్సిడీ విత్తనాల లబ్ధి, పంట ఉత్పత్తుల కొనుగోలు, పంటల బీమా వంటి ప్రభుత్వపరమైన ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు.

**రైతుల పొలాల వద్దే ఈ పంట నమోదు**

రైతుల పొలాల వద్దకే ఈ-పంట నమోదు, ఈ-క్రాప్ బుకింగ్ చేపట్టడం జరుగుతుందని... రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు మురాషావలి తెలియజేశారు. మండ లంలోని బొగ్గుడివారి పల్లె గ్రామం సచివాలయం సమీపంలోని రైతు సాగు చేసిన పసుపు పంటను పరిశీలించి ఈ-క్రాప్ బుకింగ్ చేశారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవడం వల్ల ప్రభుత్వం ఇన్‌ఫుట్ సబ్సిడీ, పంటల బీమా, పంట రుణాలు తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు వచ్చే లాభాల గురించి వారికి వివరించారు.

## పాఠశాల కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

పుల్లంపేట, ఆగస్టు 6 : మండలంలోని అన్ని పాఠశాలలో ఈనెల 8వ తేదీ పాఠశాల కమిటీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని ఎంఈవో చక్రధర్ రాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్‌టీవీడీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు పాఠశాల కమిటీ ఎన్నికలపై సూచనలు అందించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు పాటిస్తూ కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే ఎంఈవో దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల సమయంలో సమస్యలు వస్తే సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు గానీ, తహసీల్దారుకు కానీ సమాచారం ఇవ్వాలన్నారు.

**చిన్నమండెం :** ప్రశాంత వాతావరణంలో స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారులు శివనాయక్, అంజనేయులు తెలిపారు. 8వ తేదీ జరిగే స్కూల్ కమిటీ ఎన్ని కలపై ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి.. వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారి పిల్లలు పాఠశాలలో చదువుతూ ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## రుణాలు సక్రమంగా చెల్లించాలి

వీరబల్లి, ఆగస్టు 6: రుణాలు సక్రమంగా చెల్లించాలని ఏరియా కోఆర్డినేటర్ కొండా శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏల సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ సంఘాలకు అందజేస్తున్న రుణాలతో మంచి జీవనోపాధులు ఏర్పాటుకు కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఎన్‌టీఆర్ పించన్ల కోఆర్డినేటర్ ధర్మరాజు మాట్లాడుతూ అభయహస్తం పింఛన్ వస్తూ ఆగిపోయిన పెన్షనర్లకు మళ్లీ పింఛన్ వచ్చేలా రోల్ బ్యాక్ చేస్తామన్నారు. జిల్లా జీవనోపాధుల కోఆర్డినేటర్ గంగార్జున మాట్లాడుతూ కేంద్ర పథకమైన లఖ్‌పతి దీదీ సర్వే పూర్తి చేయాలన్నిరు. లీగల్ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, ఏపీయం ఖాదర్‌వలి, సీసీలు కృష్ణయ్య, నాగేంద్ర, సుభద్రమ్మ, వెంకటలక్ష్మి, వీవోఏలు పాల్గొన్నారు.

## కుష్ఠువ్యాధి పట్ల అవగాహన అవసరం

ఓబులవారిపల్లె, ఆగస్టు 6 : కుష్టువ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని డీపీఎంవో సురేష్ సూచించారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ పాఠశాలలోని విద్యార్థులకు ముక్కావారిపల్లె ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రాజశేఖర్‌తో కలిసి విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి కుష్టువ్యాధి పట్ల అవగా హన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, ముక్కావారిపల్లె వైద్య బృందం ఉషారాణి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు ముమ్మరం

రాజంపేట, ఆగస్టు 6: దేశవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 13వ తేదీ వరకు అన్ని ప్రాంతాల్లో రాజాధిక అమృత్ మహోత్స వాల్లో భాగంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ర్యాలీలు, 8న డ్రాయింగ్, పెయింటింగ్‌పై చర్చావేదికలు నిర్వహిస్తామన్నారు. 9న సాంస్కృతిక కార్యక్రమాలు, 10న స్వాతంత్ర్య సమరయోధుడు వీవీ జయంతి కార్యక్రమాలు, 11న హారతులు, వారసత్వ నడకలు, 12న క్రీడా పోటీలు, 13న జాతీయ పతాకంతో సెల్ఫీ దిగే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు సహకరించండి

పెనగలూరు, ఆగస్టు 6: ఐసీడీఎస్ అంగన్వాడీ కార్యకర్తలకు పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సహాయ సహకారాలు అందించాలని పెనగలూరు పీహెచ్‌సీ డాక్టర్ రమ్మీ న్రిముచి తెలిపారు. మంగళవారం సీహెచ్‌వో సురేంద్రనాథ్‌రాజు అధ్యక్షతన పీహెచ్‌సీ ప్రాంగణంలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు పౌష్టికాహారం తీసుకుని బిడ్డలకు ఆరు నెలల పాటు సమృద్ధిగా పాలు ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌ఎన్ లక్ష్మీనరసింహ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సుబ్రమణ్యస్వామికి అభిషేకం

నందలూరు, ఆగస్టు 6 : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వేఇనిస్టిట్యూట్ పక్కనే వెలసిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సుబ్రమణ్యస్వామికి మంగళవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. శ్రావణమాసం మొదటి మంగళవారం పురస్కరించుకుని ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

# నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, ఆగస్టు 6: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. మంగళవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, అలసత్వం చూపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుధ్యం, విద్య, వైద్యం, విద్యుత్, ఇరిగేషన్, రోడ్లు భవనాలు, రెవెన్యూ, ఐసీడీఎస్, వ్యవసాయం, తాగునీరు, పంచాయతీరాజ్, వెలుగు తదితర శాఖల పని తీరు, జరుగుతున్న అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. ఓబనపల్లె పంచాయితీలో తాగునీటి బోరు మోటారు చెడిపోయిందని, మూడు నెలలు కావస్తున్నా పట్టించుకోలేదని ఎంపీటీసీ సభ్యుడు కస్తూరి చంద్రశేఖర్ తెలిపారు. రైతులకు సబ్సిడీ కింద టార్పాలిన్, రోటావేటర్లు, బిందు, తుంపర సేద్యాలకు పనిముట్లు మంజూరు చేయించాలని వ్యవసాయశాఖ ఏవో సుధాకర్ కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే రైతులకు కావాల్సిన సబ్సిడీ పనిముట్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గుంజననది వద్ద డంపింగ్‌యార్డు ఏర్పాటు చేశారని.. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. అక్కడి నుంచి వ్యర్థాలను డంపింగ్ చేయాలని కోరారు. మండల అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ సభ్యురాలు పి.రత్నమ్మ, ఈవోఆర్‌డీ నాగార్జునరావు, ఏవో కామేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిప్రసాద్, మైసూరివారిపల్లె సర్పంచ్ సంయుక్త, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**కోతల ప్రభుత్వం కాదు...చేతల ప్రభుత్వం**

ఎన్‌డీఏ ప్రభుత్వం గత ప్రభుత్వాలా మాటలు, కోతల ప్రభుత్వం కాదని... చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైల్వేకోడూరు అభివృద్ధే ధ్యేయంగా చిత్తశుద్ధితో పని చేస్తున్నామని తెలిపారు. మూడు నెలలకే అభివృద్ధి గురించి కథలు చెప్పే నాయకులు నాలుగుసార్లు గెలిపిస్తే ఏమి చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోనే రైల్వేకోడూరు అత్యంత ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గం అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుత్వంలో రూ.1600 కోట్ల నిధులు తెచ్చామని చెబుతున్నారని, ఆ నిధులతో ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపించాలన్నారు. జనసేన పార్టీ నాయకులు జోగినేని మణి, మహిళా సర్పంచ్ కారుమంచి సంయుక్త, ఆలం రమేష్, వరికూటి నాగరాజు, పుసుపులేటి రమణ, రాగిపాటి విజయ్, ఆలం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు అమృతంతో సమానం



సూర్యనారాయణపురం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

రామాపురం, ఆగస్టు 6: బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హస్సేనమ్మ అన్నారు. మండలంలోని గువ్వలచెరువు క్లస్టర్ పరిధిలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సూర్యనారాయణపురంలో మంగళవారం అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తల్లులు పుట్టిన బిడ్డపైన తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

**లక్కిరెడ్డిపల్లె:** మండలంలోని దప్పేపల్లె అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యసిబ్బంది హైమావతి అంగన్‌వీడీవాడీవర్కర్లు గర్భిణులు, బాలింతలకు సమావేశం నిర్వహించారు. అనంతరం పిల్లలచే ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహలు చట్టరీత్యా నేరం, తల్లిపాలు బిడ్డకు అమృతతుల్యం అంటూ ర్యాలీ నిర్వహించారు.

**రాయచోటిటౌన్:** బిడ్డలకు తల్లిపాలకు మించిన ఔషధం మరొకటి లేదని లయన్స్ జీయంటీ కోఆర్డినేటర్ పీఎస్ హరినాధరెడ్డి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ ఆధ్వర్యంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలకు పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని, బిడ్డకు ఇచ్చే వ్యాధి నిరోధక తొలి టీకా తల్లిపాలే అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ అధ్యక్షుడు శివారెడ్డి, జోన్ చైర్మన్ మహ్మద్, ఉపాధ్యక్షుడు హరీశ్‌చంద్ర, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మామిడిలో కొమ్మల కత్తిరింపుతో మంచి దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

సిద్దవటం, ఆగస్టు 6 : మామిడి తోటలో కొమ్మలు కత్తిరింపుతో మంచి దిగుబడులు సాధించవచ్చునని ఉద్యానవనశాఖ అధికారి జయభరత్ రెడ్డి తెలియజేశారు. మంగళవారం జ్యోతి, పొన్నవోలు, ఎస్.రాజంపేట, వంతాటిపల్లె గ్రామాల్లోని మామిడి రైతులకు మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపులు అనివార్యమని.. తద్వారా చీడపీడలు తగ్గి మంచి దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. 10 సంవత్సరాలు పైబడిన మామిడి తోటల్లో జూలై, ఆగస్టు నెలాఖరు వరకు కొమ్మ కత్తిరింపులు చేసుకోవచ్చు అన్నారు. కత్తిరింపులు చేయకపోవడం వల్ల కేవలం 15 శాతం సూర్యరశ్మి మాత్రమే కొమ్మలకు అందడం, మిగిలిన 85 శాతం అందకపోవడం వల్ల ఆకులు కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆహారం తయారు చేసుకోలేక పూత రావడం జరగదన్నారు. కొమ్మ కత్తిరింపుల్లో భాగంగా ఎండు కొమ్మలు, తెగుళ్ల ఆశించిన కొమ్మలు అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలు కత్తిరించడం వల్ల తెగుళ్లను అరికట్టవచ్చునన్నారు. కత్తిరింపులు చేసిన తర్వాత సెప్టెంబరు లోపు ఒక్కో చెట్టుకు రెండు కిలోలు యూరియా, నాలుగు కిలోలు సూపర్, 1.5 కిలోల పొటాష్ పైపాటుగా వేసుకోవాలన్నారు. అక్టోబరు లోపు చెట్ల మధ్య, చెట్ల దగ్గర దుక్కులు చేసుకోవచ్చని తెలిపారు. నవంబరు నుంచి ఎటువంటి దుక్కులు దున్నకూడదని తెలిపారు. అలాగే ఉద్యాన రైతులందరూ ఏపీఎంఐపీ కింద డ్రిప్, స్ప్రింకర్ల కొరకు సంబంధిత రైతుసేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. ఉద్యాన సహాయకులు త్రినాథ్, సందీప్, మామిడి రైతులు పాల్గొన్నారు.

# హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి






రాయచోటి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా, రాజంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 6: ప్రభుత్వ వసతి గృహలలో సమస్యలను పరిష్కరించాలని రాయచోటి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో విద్యార్థులతో కలసి మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు కోటేశ్వర్‌రావు, మాధవ్ మాట్లాడుతూ బడుగు, బలహీన విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ హస్టళ్లు చాలా అధ్వాన పరిస్థితిలో ఉన్నాయని, జిల్లాలో దాదాపు 75 శాతం హస్టళ్లు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయన్నారు. మిగిలిన 25 శాతం భవనాలు ఉన్నప్పటికీ అవి శిథిలావస్థకు చేరుకున్నాయని.. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు విద్యను ఎలా కొనసాగిస్తారో ఆలోచించాలన్నారు.

జిల్లాలో కొన్ని హాస్టళ్ల భవనాలు పెచ్చులు ఊడిపోయి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి వుంద న్నారు. చాలా హాస్టళ్లలో తాగడానికి నీళ్లు కూడా లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహలలో సీట్లు పరిమితంగా వుండ టం వల్ల చాలా మంది విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్‌కు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

**హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలి**

రాజంపేట, ఆగస్టు 6: హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లల్లో, గురుకుల, కస్తూర్బా ఆదర్శ పాఠశాలల్లోని హాస్టళ్లలో విద్యార్థులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారే లేరన్నారు.

హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని, పెరిగిన నిత్యావసర సరకులకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, ఖాళీగా ఉన్న వార్డెన్, వాచ్‌మెన్, వంట మనిషి పోస్టులను భర్తీ చేయాలని, ప్రధానంగా హాస్టల్‌లో ప్రతివారం మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య చికిత్సలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం హాస్టళ్ల నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ కార్యాల యంలో అధికారులకు విన్నవించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్య దర్శి బాలసుబ్రమణ్యం, నందకిషోర్, పవన్‌తేజ్, రాంప్రసాద్, దినేష్, కార్తీక్, శ్రీహరి, భరత్, సంతోష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



## ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శేఖర్

రాయచోటిటౌన్, ఆగస్టు6: ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెద్దపల్లి శేఖర్‌ను నియమిస్తూ మంగళవారం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు నియమించారు. ఈసందర్భంగా శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## పుల్లంపేటలో ఓ మోస్తరు వర్షం

పుల్లంపేట, ఆగస్టు 6: పుల్లంపేటలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. సుమారు గంటసేపు వర్షం కురవడంతో వీధు లన్నీ జలమయ్యాయి. అప్పయ్యరాజుపేట పంచాయతీ వంటిల్లు అరుంధ తీవాడలో రోడ్డుపై వర్షపునీరు నిలవడంతో స్థానికులకు ఇబ్బందిగా మారింది.

## మున్సిపల్ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, ఆగస్టు 6: అనంతపురంలో ఈనెల 10వ తేదీ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమోహన్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాయలసీమ మున్సిపల్ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లికార్జున పిలుపు నిచ్చారు. రాయలసీమలోని అన్ని మున్సిపాలిటీల మినిస్ట్రీరియల్ సిబ్బందితో పాటు సచివాలయ పరిపాలనా కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

## కచ్చితమైన పశుసంపద వివరాలను పొందుపరచాలి



మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లై

రాజంపేట, ఆగస్టు 6: రాజంపేట డివిజన్‌లోని పశుసంపదను పూర్తిగా లెక్కించి.. కచ్చితమైన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. మంగళవారం రాజంపేట డివిజన్ పశుసంవర్ధకశాఖ కార్యాల యంలో పశువైద్య సూపర్‌వైజర్‌లు, ఇతర సిబ్బందికి అఖిల భారత పశుగణ లెక్కింపు అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సిబ్బంది తిరిగి ఈ ఏడాది చివరి నాటికి పూర్తిస్థాయి సర్వే చేసి పశుసంపద వివరాలను పక్కాగా లెక్కించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పశువైద్య సిబ్బంది సెప్టెంబరు 1వ తేదీ నుంచి ఈపనిలో నిమగ్నం కావాలన్నారు. డివిజనల్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ పశుగణ లెక్కింపులో సంబంధిత రైతులు పశువైద్యసిబ్బందికి సకరించాలని కోరారు. కార్యక్రబమంలో డాక్టర్‌లు ప్రతాప్, సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే పక్కాగా నిర్వహించాలి



స్కానింగ్ పరికరాలను పరిశీలిస్తున్న డీఈఎంవో

రామాపురం, ఆగస్టు 6: క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వేను ఆరోగ్య సిబ్బంది పక్కగా నిర్వహించాలని డీఈఎంవో దేవశిరోమణి, మండల వైద్యాధికారి వినోద్ కుమార్‌లు అన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా మీటింగ్‌కు ఆమె హాజరై మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి తల్లిపాల వారోత్సవాలు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్నాయని.. ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలకు తప్పక హాజరు కావాలన్నారు. గ్రామాల్లో ప్రస్తుత సీజన్‌లో వర్షాలు కురవడం వల్ల వీధుల్లో, గుంతల్లో మురికినీరు నిల్వ ఉండడం వల్ల దోమ లు వృద్ధి చెంది విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్ర వారం డ్రైడే పాటించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో యూఎస్‌జీ స్కానింగ్ పరికరాన్ని అమర్చి పరీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్యశ్రీ, సీహెచ్‌వో ఇలేజర్, పీహెచ్‌ఎన్ విజయకుమారి, ఎంహెచ్‌ఎల్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలపై తక్షణం స్పందించాలి

- బీజేపీ కిసాన్‌మోర్చా రాయలసీమ జోన్‌ఇన్‌చార్జి



జేసీకి వినతి పత్రం అందిస్తున్న బీజేపీ కిసాన్‌మోర్చా నేతలు

రాయచోటి(కలెక్టరేట్)ఆగస్టు 6: జిల్లాలో రైతాంగ సమస్యలపై తక్షణం స్పందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోన్ ఇన్‌చార్జి ఓసురి కిరణ్‌కుమార్ కోరారు. రైతులపై గత ప్రభుత్వం చూపిన వ్యతిరేకత, జిల్లాలో ప్రాజెక్టుల పరిస్థితి తదితర అంశాలపై మంగళవారం జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకాసురుల వల్ల తెగిపోయిన అన్నమయ్య డ్యాం నిర్మాణ పనులు వెంటనే చేపట్టి, నిర్వాసితులకు ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి... పడమటి మండలాల రైతులకు న్యాయం చేయాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు రైతుసేవా కేంద్రాల ద్వారా సబ్సిడీతో అందించాలని, సూక్ష్మ సేద్య పరికరాలను 50 శాతం సబ్సిడీ ధరలతో అందించాలని, జిల్లాలో టమోట గుజ్జు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వర్షం లేక పంటలు ఎండిపోతున్నాయని.. తక్షణం పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు బాలాజీ, వెంకటేశ్వర్లు, రెడ్డిమునినాయుడు, అంజినేయులు, వెంకటరమణ, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

సుండుపల్లె, ఆగస్టు 6: అసాంఘిక కార్యకలాపాలకు విద్యార్థినీ, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎస్‌కేయం హస్సేన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంకేఆర్ జూనియర్ కళాశాలలో గంజాయి, మద్యం, ఇతర చెడు వ్యసనాలకు బానిసలైతే కలిగే దుష్పలితాలను వివరించారు. మాదకద్రవ్యాలు తీసుకోవడం వలన జీవితం చిన్నాభిన్నం అవుతుందన్నారు. చిన్నతనం నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండకుండా లైసెన్స్ లేకుండా వాహనాలు నిడిపితే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని.. యువతను ఆకర్షించేందుకు అనేక యాప్‌లు అందుబాటులోకి వచ్చాయని.. ఆన్‌లైన్ యాప్‌లు, బెట్టింగ్‌ల ద్వారా మోసపోవద్దని సూచించారు.

## 'గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లను సస్పెండ్ చేయాలి'

రాయచోటిటౌన్, ఆగస్టు 6: సంబేపల్లె మండలం ఎర్రగుంట్ల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో తాత్కాలిక ఉద్యోగాలను అమ్మకానికిపెట్టిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అరుణ, వైస్‌ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మిలను సస్పెండ్ చేయాలని జనసేనపార్టీ రాజంపేట పార్లమెంట్ నేత రామాశ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం తాత్కాలిక ఉద్యోగిని సునీత ఉద్యోగం రెన్యూవల్ కోసం గత రెండేళ్లుగా డీసీవో, కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా లక్ష రూపాయలు ఇస్తే తప్ప ఉద్యోగం లేదని తెగేసి చెప్పడంతో లంచం ఇచ్చే స్తోమత లేక విషగుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి.. రాయచోటి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సునీతను మంగళవారం రామాశ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని జిల్లా సర్వోన్నతాధికారిని కోరారు. అలాగే సునీతకు తన ఉద్యోగ రెన్యువల్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆనందరెడ్డి, చెన్నక్రిష్ణ, సునీత పాల్గొన్నారు.

## సిద్దవటం ఫారెస్ట్ కార్యాలయం సందర్శన



సిద్దవటం, ఆగస్టు 6: సిద్దవటం ఫారెస్ట్ రేంజి కార్యాలయాన్ని మంగళవారం కడప సోషల్ ఫారెస్ట్ డివిజనల్ డీఎఫ్‌వో నాగార్జునరెడ్డి సందర్శించారు. ఫారెస్ట్ కార్యాలయం పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉందని కొనియాడారు. కొండూరు ప్రాంతంలో నర్సరీని పరిశీలించేందుకు వెళుతూ కార్యాలయం సందర్శించినట్లు ఆయన తెలియజేశారు. సిద్దవటం ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం అభినందనీయం



అన్నదాన కార్యక్రమంలో తహసీల్దార్ రమణమ్మ

ఒంటిమిట్ట, ఆగస్టు 6: పేద లకు అన్నదానం చేయడం అభినందనీయమని తహసీల్దారు రమణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద మంగళవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సామాజిక కార్యక్రమాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్య క్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొత్తపల్లె వెంకటేశు, పసుపులేటి వెంకటరమణ తదిత రులు పాల్గొన్నారు.

# స్విమ్స్ డైరెక్టర్ ఎవరు?




టీటీడీ నిర్వహణలో ఉన్న శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) డైరెక్టర్‌గా ఎవరు రాబోతున్నారు అనే చర్చ వైద్య వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రస్తుత డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ పదవీకాలం రెండేళ్లపాటు ఉన్నప్పటికీ ప్రభుత్వం మారడంతో ఈయన స్థానంలో కొత్తవారికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. రాజకీయ నాయకులతో సఖ్యతగా ఉండే రవికుమార్, టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ప్రభుత్వం మారగానే మొదలు పెట్టారని అంటున్నారు. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో కార్డియోథొరాసిక్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆర్వీ కుమార్‌ను వైసీపీ ప్రభుత్వంలో స్విమ్స్ డీమ్డ్ వర్సిటీ వైస్ చాన్సలర్ కమ్ డైరెక్టర్‌గా ప్రతిష్ఠాత్మకమైన బాధ్యతలు అప్పగించారు. స్విమ్స్‌లో ఉన్న సీనియర్లను పట్టించుకోకుండా ఈయన్ను తీసుకురావడంపై అప్పట్లో వైద్యవర్గాలో చర్చ జరిగింది కూడా. అయితే వైసీపీ నాయకులకు ఆగమేఘాల మీద వైద్య సేవలు ఇంటికే అందిస్తూ ఈయన వారి మెప్పు పొందారు. నిజానికి గుండె వైద్య నిపుణుడిగా స్విమ్స్‌లో పేరున్న సీనియర్ డాక్టర్ రాజశేఖర్‌కు వెంగమ్మ తర్వాత డైరెక్టర్ పదవి లభిస్తుందని అందరూ భావించారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి బాగా సన్నిహితుడిగా కూడా పేరున్నందున ఈయనకు పదవి లభిస్తుందని అనుకున్నా అప్పటి సీఎం జగన్ పేషీ నుంచి రవికుమార్ పేరు అనూహ్యంగా తెరమీదకు వచ్చింది. ఇప్పుడు మళ్లీ డాక్టర్ రాజశేఖర్ పేరు వినిపిస్తోంది. బర్డ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ పేరు కూడా బలంగానే వినిపిస్తోంది. అయితే ఆయన వయసు రీత్యా సాధ్యం కాదేమో అనే అనుమానాలూ ఉన్నాయి. మరోవైపు మాజీ డైరెక్టర్ వెంగమ్మ పేరు కూడా ప్రస్తావనకు వస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో అత్యంత అవమానకర రీతిలో ఆమెను పంపేసినందున కూటమి ప్రభుత్వం ఆమె పేరును సానుకూలంగా పరిశీలించవచ్చని కొందరు అంటున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

### ఐఏఎస్‌ను నియమిస్తారా?

ఇలా వుంటే స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆస్పత్రులను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి.. ఒక డైరెక్టర్‌ను ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. ఒకవేళ ఈ అంశం తెరపైకి వస్తే ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించే అవకాశాలూ లేకపోలేదు. ఏదిఏమైనా టీటీడీ పాలకమండలి నియామకం జరిగిన తర్వాతే స్విమ్స్ డైరెక్టర్ మార్పులు జరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. రాయలసీమకే తలమానికం అయిన స్విమ్స్ సారథ్య బాధ్యతలను రాజకీయ కోణంలోంచి చూసి కాకుండా ప్రతిభావంతులకు అప్పగిస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. పేదలకూ మంచి వైద్యం అందుతుంది.

# అర్ధరాత్రి దీపాల పేరుతో మోసాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: ముక్కంటి ఆలయ పరిసరాల్లో అర్ధరాత్రి వేళ కొందరు దళారీలు దీపాల పేరుతో భక్తులను భారీగా మోసం చేస్తున్నారు. ఆలయం పరిసరాల్లోని 1వ గేటు, 2వ గేటు సమీపంలో భక్తులు రాత్రి వేళ నిద్రిస్తుంటారు. ఉదయం వీరికి కొందరు దీపాలు వెలిగిస్తే దోషం పోతుందంటూ నమ్మిస్తారు. అలా నకిలీ నేతి దీపాలను భక్తులకు అంటగడుతూ చాలా ఏళ్లగా దందాలు సాగిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఉదయం వేళ భక్తులను మోసగించే ప్రక్రియకు స్వస్తి పలికారు. అయితే గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి పాపాల దీపాలను విక్రయిస్తున్నారు. రాత్రి ఒంటి గంట నుంచి 1వ గేటు, 2వ గేటు సమీపంలోని భక్తులను కొందరు దళారీలు హడావుడిగా నిద్ర లేపేస్తున్నారు. అక్కడికి సమీపంలోని కాశీ విశ్వనాథస్వామి సన్నిధి, వీరభద్రస్వామి సన్నిధి, వాయుమూల గణపతి వద్ద ప్రతి ఒక్క భక్తుడూ వేర్వేరుగా మూడు దీపాలు వెలిగించాలంటూ నమ్మిస్తున్నారు. ఒక్కో దీపానికి రూ.500 చొప్పున ఒక్కో భక్తుడి నుంచి రూ.1,500 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భక్తులను మోసగించే ఈ తరహా దొంగలు ఉదయం ఐదు గంటల్లోగా ఈ దందాను ముగిస్తున్నారు. అర్ధరాత్రి ఆలయంలో దోషం పేరుతో ఇలా భక్తులను దోపిడీ చేయడం సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారింది.


అర్ధరాత్రి భక్తులు వెలిగించిన దీపాలు

## కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు భవనాల పరిశీలన



గుడుపల్లె, ఆగస్టు 6: కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన భవనాలను మంగళవారం ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జి వీసీ దొరస్వామి, విద్యాలయ అధికారులు పరిశీలించారు. ఈ ఏడాది నుంచే కుప్పం నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభించాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. దీంతో ద్రావిడ వర్సిటీలోని హరప్ప భవనం, గురుకులం భవనాలను అధికారులు పరిశీలించారు. గురుకుల భవనం అనువైనదిగా భావించారు. చిన్న చిన్న మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసరాజు, డీటీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌వి ఫ్యాక్షన్ రాజకీయాలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్


మీడియాతో మాట్లాడుతున్న సీఆర్ రాజన్

గుడిపాల, ఆగస్టు 6: గ్రూపు రాజకీయాలతో వైసీపీ నేతలు హత్యలు చేసుకుంటుంటే అది టీడీపీపై రుద్దడం జగన్ ఫ్యాక్షన్ రాజకీయానికి నిదర్శనమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ విమర్శించారు. మంగళవారం గుడిపాలలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ ఇంకా అధికారంలో ఉన్నట్లే ఊహించుకుంటూ తనకిష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తూ ప్రశాంతంగా ఉన్న రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టేలా చేయడం సబబు కాదన్నారు. బీసీలకు గుర్తింపు ఇచ్చిన ఏకైక నాయకుడు చంద్రబాబే అన్నారు. మీ ఉనికిని కాపాడుకోవడం కోసం ప్రభుత్వంపై బురదచల్లితే, ఇప్పుడిచ్చిన 11 మంది ఎమ్మెల్యేల సంఖ్య సున్నా అవుతుందన్నారు. పార్టీనేతలు రాధాకృష్ణ, సుమతి మురళీనాయుడు, ఉదయ్, త్రిమూర్తి, విజయ్, జయచంద్ర నాయుడు, బాబు నాయుడు, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

## 'ఎర్ర'దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం సహా నిందితుడితో పోలీసులు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 6: మండలంలోని పిళ్లారికుప్పం గ్రామ సమీపంలో గల మామిడితోపులో రెండు రోజుల క్రితం దొరికిన ఎర్రచందనానికి సంబంధించి ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఆర్‌పురం ఎస్ఐ కుళాయిప్ప తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు.. మాజీ సైనికుడు రవినాయుడు తన పొలంలో ఉన్న ఎర్రచందనం చెట్లను అటవీ శాఖ అనుమతితో డ్రెసింగ్ చేసి, అక్కడే ఉన్న గోడౌన్‌లో భద్రపరిచారు. గతనెల 23వ తేదీ అదే గ్రామానికి చెందిన వైసీసీ నేతలు కొందరు దుంగలను దొంగలించి, ట్రాక్టర్‌లో వెంకటాపురం సమీపంలో కొండవద్ద డంప్ చేశారు, సమాచారం తెలుసుకున్న పోలీసులు వారి నుంచి 37 ఎర్రచందనం దుంగలను, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. దానికి సంబంధించి మంగళవారం సుదర్శన్(21), బాలాజీ(32), చరణ్(29), మోహన్‌రాజ్(38), గురవయ్య(39)లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కుళాయిప్ప తెలిపారు. కాగా, నిందితులను కాపాడాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే థామస్ మంగళవారం కార్వేటినగరం సీఐ సత్తిబాబు, ఎస్ఐ కుళాయప్పలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## డీఎడ్ ఫెయిలైన అభ్యర్థులకు సప్లిమెంటరీ పరీక్షలకు అవకాశం

కార్వేటినగరం, ఆగస్టు 6: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డీఎడ్ రెగ్యులర్, స్పాట్ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ విలేకరులకు తెలిపారు. 2018-20 సంవత్సరాల మధ్య ప్రైవేటు డీఎడ్ కాలేజీలో అడ్మిషన్లు పొంది ఫెయిలైన అభ్యర్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయటానికి విద్యాశాఖ అనుమతించింది. మరిన్ని వివరాల కోసం కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

## కేరళ వరద బాధితులకు ఆటోడ్రైవర్ ఆర్థికసాయం


కలెక్టర్‌కు చెక్ అందజేస్తున్న రమేష్‌బాబు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 6: గత వారం కేరళ రాష్ట్రంలో జరిగిన వరద బీభత్సానికి చలించిన గుడిపాల మండలం 189 కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ జి.రమేష్‌బాబు తనవంతుగా రూ.3,300 విరాళంగా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం ఇందుకు సంబంధించిన చెక్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందజేశారు. డ్రైవర్ దాతృత్వాన్ని కలెక్టర్ అభినందించారు.

## పుత్తూరుకు చెందిన అసిస్టెంట్ ఎడిటర్ మృతి

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సినీ అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేస్తున్న తిరుపతి జిల్లా పుత్తూరుకు చెందిన మణిరత్నంరెడ్డి వడపళనిలో మృతి చెందారు. 'టౌన్‌బస్' అనే లాడ్జిలో బస చేసిన ఆయన వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం మందులు కొనుగోలు చేసేందుకు లాడ్జి నుంచి బయటకు రాగానే స్పృహ తప్పి పడిపోయారు. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు 108 అంబులెన్సును రప్పించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిసింది. ఆయన మృతదేహాన్ని కేకే నగర్ ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎవరు?

● పంద్రాగస్టున జాతీయ పతాకాన్ని ఎగురవేసేదెవరో?

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 6: జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి నియామకం ఇంకా జరగలేదు. మరో పది రోజుల్లో చిత్తూరులో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో జాతీయ జెండాను ఎవరు ఎగురవేస్తారో, జిల్లా ప్రగతిపై ప్రజలకు ఎవరు సందేశమిస్తారో తెలియడం లేదు. ఆలోగా ఇన్‌చార్జి మంత్రి నియామకం పూర్తికాకుంటే ఎవరిచే పోలీసు పరేడ్ మైదానంలో త్రివర్ణ పతాకం ఎగురవేస్తారన్నది అర్థం కావడం లేదు. జిల్లాకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్ప మరెవరూ మంత్రులుగా లేరు. ఈ క్రమంలో జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి నియామకం జరగని పక్షంలో సీనియర్ మంత్రుల్లో ఒకరికి అవకాశం కల్పిస్తారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులను నియమించడం కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ప్రతి మూడు నెలలకోసారి జిల్లా సమీక్షా మండలి సమావేశం నిర్వహిస్తారు. జిల్లా ప్రగతిని సూచించే వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించి తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి పంపించేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి ఉషశ్రీ చరణ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించారు. ఆమె జిల్లా ఇన్‌చార్జిమంత్రిగా ఉన్నా అన్ని సమావేశాల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి హవానే కొనసాగేది. ఆ తర్వాత ఎన్నికల వాతావరణం రావడం, మార్చిలో ఎన్నికల కోడ్ ప్రకటించడంతో డీఆర్సీ నిర్వహించే అవకాశం లేకపోయింది. ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఇంకా ఇన్‌చార్జి మంత్రిని ప్రకటించలేదు.

# 3500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యం



వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 6: రానున్న వంద రోజుల్లో జిల్లావ్యాప్తంగా 3500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సూక్ష్మనీటి సాగు పథకం ద్వారా బిందు సేద్యం, తుంపర్ల సేద్యానికి సంబంధించి పరికరాల పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఏడాది బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యం 21వేల హెక్టార్లు కాగా, రానున్న వంద రోజుల్లో మరో 3500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. ఇందుకోసం రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రస్తుతం కొనసాగుతున్న ఈ-క్రాప్ నమోదు జరుగుతోందని, దీంతోపాటు రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 7500 ఎకరాల్లో హార్టికల్చర్ ప్లాంటేషన్ లక్ష్యం కాగా, ఇంతవరకు 5500 ఎకరాలను గుర్తించినట్లు డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, పట్టు పరిశ్రమశాఖ అధికారిణి శోభారాణి, డివిజన్, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఏనుగుల కదలికపై అప్రమత్తత అవసరం


అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న చైతన్యకుమార్‌రెడ్డి

రామకుప్పం, ఆగస్టు 6: ఏనుగుల కదలికలను తెలుసుకునే విషయంలో ట్రాకర్లు, అటవీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని అటవీశాఖ జిల్లా అధికారి చైతన్యకుమార్‌రెడ్డి, కడా ప్రాజెక్టు అధికారి వికాస్‌మర్మత్ సూచించారు. ఏనుగుల కదలికలు, మదపుటేనుగులను బంధించే విధానంపై రామకుప్పం మండలం ననియాల ఎలిఫెంట్‌క్యాంపులో రెండు రోజుల పాటు నిర్వహించే అవగాహన శిబిరాన్ని మంగళవారం వీరు ప్రారంభించి మాట్లాడారు. ఏనుగుల కదలికలను గుర్తించేటపుడు ఎంతో ఓపిక కలిగి ఉండాలన్నారు. మదపుటేనుగులతో పాటు సాధారణ ఏనుగులు కూడా కొన్నిసార్లు దాడులకు పాల్పడే అవకాశాలుంటాయన్నారు. దాడుల నుంచి తప్పించుకునే మెలకువలను అలవర్చుకోవాలన్నారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ప్రవర్తించి వన్యప్రాణుల రక్షణ, వనసంరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం తిరుపతి జూపార్క్ క్యూరేటర్ సెల్వం, మదపుటేనుగుల పట్టివేతలో నిపుణులైన రిటైర్డ్ ఎఫ్ఆర్వో రఘునాథ్, తమిళనాడుకు చెందిన విశ్రాంత అటవీ అధికారులు తంగరాజ, సత్యప్రకాష్, మనోహరన్ ఏనుగుల కదలికలు, మదపుటేనుగుల పట్టివేత తదితర కార్యకలాపాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, కుప్పం, పుంగనూరు క్షేత్రాధికారులు జయశంకర్, శ్రీరాములు, ఉపక్షేత్రాధికారులు ధనుంజయుడు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెద్దిరెడ్డిపై వేటు తప్పదు

బీసీవై అధినేత రామచంద్ర యాదవ్


హర్షకుమార్ నివాసంలో విలేకరులతో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై వేటు తప్పదని బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అమలాపురం మాజీ ఎంపీ, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ జీవీ హర్షకుమార్‌ను మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారు కొద్దిసేపు పోలవరం, వర్గీకరణ అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం రామచంద్ర యాదవ్ విలేకరులతో మాట్లాడారు. పెద్దిరెడ్డి ఎన్నిక చెల్లదన్నారు. అక్కడ జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో ఆధారాలతో న్యాయస్థానానికి నివేదించానన్నారు. అతని ఎన్నిక అనైతికమని, త్వరలోనే పెదిరెడ్డిపై వేటు తప్పదని అన్నారు. ఇక రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక లోపాలు ఉన్నాయని చెప్పారు. వాటిని పరిశీలించి, సరిచేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజ్యాంగ సవరణ జరిగి పార్లమెంట్‌లో తీర్మానం చేశాక సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వాల్సి ఉండగా దానికి విరుద్ధంగా జరిగిందన్నారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి తమ బీసీ నేతలతో చర్చించి మద్దతు ఇస్తామన్నారు. అనంతరం హర్షకుమార్ మాట్లాడుతూ... పోలవరం డయాఫ్రం వాల్, కాఫర్ డ్యామ్ నిర్మాణాల్లో అనేక లోపాలున్నాయన్నారు. ఆలోపాలపైన, వర్గీకరణపైన త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని రామచంద్రయాదవ్, తాను నిర్ణయించుకున్నామని చెప్పారు.



## గోవిందా.. గోవిందా..!



తిరుమలలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి శ్రీవారి ఆలయం ముందు కొంత ప్రదేశం వరకు నెయ్యితో కూడిన మురుగు పొంగింది. దర్శనానంతరం ఆలయం బయటకు వచ్చేవారు, ప్రసాదాలు తీసుకొచ్చే భక్తులు దీనిపై కాలు వేయడంతో జారిపడి గాయపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## చిరుత పులా.. రేసు కుక్కలా?

రామచంద్రాపురం, ఆగస్టు 6: అడవి జంతువు ఓ దూడను చంపి తిన్న సంఘటన రామచంద్రాపురం మండలం పరమాల అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్ద సోమవారం రాత్రి జరిగింది. పరమాలకు చెందిన శేషమ్మ సోమవారం సాయంత్రం అటవీ ప్రాంత సమీపంలోని తమ పొలం వద్ద రెండు ఆవులతోపాటు ఓ దూడను కట్టి ఇంటికి వచ్చింది. మంగళవారం ఉదయం ఆవు పాలు తీయడానికి పొలం వద్దకు వెళ్లగా.. దూడను గుర్తు తెలియని అడవి జంతువు చంపి సగం తిన్నట్లు గుర్తించింది. గ్రామస్తులకు తెలపగా వారు అటవీశాఖ అధికారి కిషోర్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అడవి జంతువు పాదముద్రలు సేకరించి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఆ నివేదిక వస్తే గానీ ఏ జంతువు దూడను చంపిందో గుర్తించలేమన్నారు. ఎన్నో ఏళ్లుగా తమ పొలాల వద్ద పశువులను కట్టేస్తున్నప్పటికీ ఇలాంటి ఘటన ఇంతకు మునుపు జరగకపోవడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. దూడను చంపింది చిరుత పులా, రేసు కుక్కలా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

## భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య


మృతిచెందిన పురుషోత్తం

గంగవరం, ఆగస్టు 6 : భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న వైనమిది. పోలీసుల కథనం మేరకు... నడింపల్లెకు చెందిన పురుషోత్తానికి ఏడేళ్ల క్రితం మంజులతో పెళ్లయింది. వీరికి ఒక కుమార్తె ఉంది. కొద్దిరోజులుగా పురుషోత్తం మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో నాలుగురోజుల క్రితం భార్యను పుట్టింటికి పంపించేశాడు. తరువాత అత్తవారింటికి వెళ్లి కాపురానికి రావాలని భార్యను కోరాడు. ఆమె అంగీకరించకపోవడంతో మనస్థాపం చెంది స్వగ్రామానికి వచ్చేశాడు. ఇంట్లో ఉరివేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోలీసులు పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## పంట నష్టపోయిన రైతులకు చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, ఆగస్టు 6: ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మురళీమోహన్ చేతులమీదుగా మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. ఏనుగుల దాడిలో మరణించిన బలిజపల్లికి చెందిన చిన్నబ్బ కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు, గాయపడిన పాలేరు గ్రామానికి చెందిన పద్మనాభరెడ్డికి రూ.69వేలు చెక్కులు అందించారు. అలాగే 91 మంది రైతులకు పంట నష్టపరిహారం కింద రూ.5.11లక్షలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏనుగుల దాడుల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, ఎన్పీ ధరణీ నాయుడు, కోదండయాదవ్, కోకా ప్రకాష్ నాయుడు, కమల్‌నాథ్ రెడ్డి, ఎఫ్ఎస్‌వో షబీనా తాజ్, బీట్ ఆఫీసర్ ప్రతాప్, పద్మావతి, ఢిల్లీరాణి పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలపై జేసీకి వినతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు6: రైతాంగ సమస్యలపై బీజేపీ నాయకులు మంగళవారం జేసీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్వాసితుల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధా పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. కుంటలు, చెరువుల్లో పూడికల తీయించాలన్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఓసూరి కిరణ్‌కుమార్, తదితర రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కాసులిస్తేనే.. భూముల సర్వే!

గుర్రంకొండ, ఆగస్టు 6: గుర్రంకొండ తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే కొందరు సచివాలయ సర్వేయర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రైతులు, ప్రజల నుంచి భూముల సర్వే కోసం మామూళ్లు వసూలు చేస్తునట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో రైతులు భూములను సర్వే చేయాలంటే ముందుగా ఆయా గ్రామాల సచివాలయాల సర్వేయర్‌తో మాట్లాడి చలానా కట్టే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. కొందరు సచివాలయ సర్వేయర్‌లు మొహమాటం లేకుండా సొమ్ము డిమాండు చేస్తున్నారని రైతులు చర్చించుకుంటున్నారు. వారికీ మామూలు ఇస్తే చలానా కట్టకుండానే సర్వే చేస్తునట్లు రైతులు, ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై మండల సర్వేయర్ రెడ్డిశేఖర్ వివరణ కోరగా సచివాలయ సర్వేయర్లు రైతుల నుంచి మామూలు వసూలు చేస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు, ఆగస్టు 6: కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ రామ్మోహన్ తెలిపారు. మండలంలోని దేవళచెరువు పంచాయతీ చిటికివారిపల్లెకు చెందిన రమణప్ప(43) కర్ణాటక మద్యం ప్యాకెట్లు తీసుకెళ్తుండగా బత్తలాపురం క్రాస్ వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి 40 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## బూర్లపల్లె మాజీ సర్పంచ్ మృతి

పెద్దతిప్పసముద్రం అగస్టు 6 : బూర్లపల్లె మాజీ సర్పంచ్ మాదు కృష్ణారెడ్డి(85) అనారోగ్యం కారణంగా మంగళవారం మృతి చెందాడు. ఈయన రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా, ఒకసారి ఎన్నికల్లో గెలుపొంది గ్రామానికి విశిష్ట సేవలందించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు గూటం ఈశ్వరప్ప, మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, మదుకర్‌రెడ్డి, జయరాము నివాళులర్పించారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దతిప్పసముద్రం అగస్టు 6 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ అధ్యక్షుడు మహమూద్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను చర్చించనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులలతో పాటు మండల స్థాయి అధికారులందరూ ఈ సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

## గర్భిణుల నమోదును పూర్తి చేయాలి

కలకడ, ఆగస్టు 6: సచివాలయాల వారీగా గర్భిణులు, బాలింతల వివరాల నమోదు పూర్తి చేయాలని డాక్టర్ జవహర్‌బాబు సూచించారు. మంగళవారం ఆశా డే సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాటాడుతూ మాతాశిశు సంరక్షణ, ఎంసీబీ వివరాలను సమగ్రంగా పూరించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలున్న ఇళ్లలో ఓఆర్ఎస్ పాకెట్లును పంపిణీ చేయాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది జయరామయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బరత్న పాల్గొన్నారు.

## నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

పెద్దమండ్యం, ఆగస్టు 6: పెద్ద మండ్యం సమీపంలో నిర్మించిన అంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల మధ్య సమయంలో అభయ అంజనేయస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నట్లు నిర్వాహకులు గ్రామ ప్రజలు, కత్తి గోవిందు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా పెద్దమండ్యంలో ఈ నెల 7వ తేదీ బుధవారం ఉదయం అభయ అంజనేయస్వామి విగ్రహ ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. 8వ తేదీ గురువారం గణపతి పూజ, మంగళహారతి, సాయంత్రం దేవతల మూల మంత్ర హోమం కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

## ఈ-పంట నమోదు చేసుకోవాలి

పీలేరు, ఆగస్టు 6: ప్రస్తుత సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు విధిగా ఈ-పంట యాప్‌లో నమోదు చేసుకోవాలని పీలేరు అగ్రికల్చర్ అసిస్టెంట్ హిమబిందు తెలియజేశారు. తమ సమీప రైతు భరోసా కేంద్రాలలో పంట వివరాలు అందజేస్తే సచివాలయ సిబ్బంది రైతుల భూముల వద్దకే వచ్చి నమోదు చేస్తారని ఆమె వివరించారు. మండలంలో ఈ-పంట నమోదు మంగళవారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు.

## ఘనంగా వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు


వెంకటరెడ్డిని సన్మానిస్తున్న విజయభారతి సేతు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6: స్థానిక ప్రశాంత నగర్‌లోని వెంకటరెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈ వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి మిఠాయిలు సిబ్బందికి విద్యార్థులకు పంచి పెట్టారు. విజయభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ సేతు పుష్పగుచ్చం ఇచ్చి దుశ్శాలువ కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిద్దార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. గోపాల్‌రెడ్డి, ఈ. హేమంత్‌కుమార్, ఎన్వీ వరప్రసాద్, అధ్యాపకులు, సత్యసాయి స్కూల్ ఉపాధ్యాయలు, సిబ్బంది పాల్గొన్నారు.

## బసినికొండ ఆలయానికి దారి ఏర్పాటు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6: శ్రావణమాసం సందర్భంగా మండలంలోని బసినికొండ దేవాలయానికి వెళ్లే దారిని మంగళవారం హిందూ చైతన్య వేదిక, సైకిల్ షాపు బాలాజీ ఆధ్వర్యంలో శుభ్రపర్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి ఆనంద్, ఆదినారాయణ, భాస్కర్, దేవా, మోహన, నాగరాజ, మోహన, పుల్లప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక దందా సహించం!

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఆగస్టు 6: నా పేరు చెబుతూ ఇసుక అక్రమ రవాణా చేయడాన్ని సహించబోనని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక సుభాష్ రోడ్డులోని ఆయన నివాసం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించారు పేదలకు ఇసుక భారం కాకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోందన్నారు. చిప్పిలి ఎస్ఎస్ ట్యాంకు నుంచి వైసీపీ నాయకులు ఐదేళ్లలో వేలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా చేశారన్నారు. దీంతో అక్కడ పెద్ద బావులను తలపిస్తూ గుంతలు ఏర్పడ్డాయన్నారు. వీటిని నింపడానికి ఇసుక అవసరం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పుకుని అక్రమాలు పాల్పడాలనుకుంటే కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కొందరు వైసీపీ నాయకులు తన వద్దకు వచ్చి తనతో ఫొటోలు తీసుకుని అందరినీ మభ్యపెడుతున్నారన్నారు. ఎమ్మెల్యే తమకు చాలా సన్నిహితుడని అధికారులు, ఇతరుల వద్దకు వెళ్లి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలకు తక్కువ ధరకు ఇసుక సరఫరా చేయాలని సూచించారు. కొంతమంది అధికారులు ఇసుక అక్రమ రవాణాదారులకు సహకరిస్తున్నట్లు తనకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఎస్‌ఏ మస్తాన్, నాదెళ్ల శివన్న, ఆర్‌జే వెంకటేశ్, షంషీర్, నాగూర్‌వలి, బాబాఫకృద్దీన్, జేసీబీ మధు, కత్తి లక్ష్మన్న, తలారి రాధ, పులి మహాలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

**స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం**

పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ల సమావేశం లో ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి కృషి చేసిన ఐరిష్ వనిత అనిబిసెంట్ మదనపల్లె నుంచే హోంరూల్ ఉద్యమాన్ని నడిపారన్నారు. అలాంటి ప్రాశస్త్యం వున్న మదనపల్లెలో స్వాంతంత్ర్య దినోత్సవాన్ని ఈనెల 12, 13 తేదీలతో పాటు 14వ తేదీ అర్ధరాత్రి వరకు నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా 12వ తేదీ పట్టణంలో విద్యార్థుల ర్యాలీ, 13వ తేదీ ఆయా విద్యాసంస్థల పరిధిలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. 14వ తేదీ సాయంత్రం ఏడు గంటల నుంచి బెంగళూరు బస్టాండు నుంచి కాగడాల ర్యాలీతో వచ్చి మిషన్ కాంపౌండులో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు అహ్వానం పంపుతామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ కొండయ్యనాయుడు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు కృష్ణవేణి, బాలకృష్ణమూర్తి, ప్రైవేటు విద్యాసంస్థల కరస్పాండెంట్లు అర్.గురుప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

**చిన్న వ్యాపారులను బతకనివ్వండి**

వారపుసంతలో చిన్న వ్యాపారులు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకొచ్చే రైతులను కూడా బతకనివ్వండంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఎస్పీ కొండయ్యనాయుడులతో కలసి వారపు సంతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారపు సంతలో కొంత మంది నిబంధనలు అతిక్రమించి పర్మనెంట్ షెడ్లు వేసుకుని, ఎకరాకు పైగా స్థలాన్ని ఆక్రమించేశారన్నారు. దీని వలన చిన్న వ్యాపారులకు స్థలం లేక రోడ్లపై దుకాణాలు పెడుతున్నారని, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. వెంటనే పర్మనెంట్ షెడ్లు వేసుకున్న వారు వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. అందరు వ్యాపారాలు చేసుకుని వారి కుటుంబాలను పోషించుకోవాలని, స్వార్థంగా అలోచించవద్దని సూచించారు.

**విద్యార్థులకు బ్యాగుల పంపిణీ**

**మదనపల్లె అర్బన్:** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ఎమ్మెల్యే బ్యాగులు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకోవాలని తెలిపారు. విద్యాపరంగా ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థుల కోసం లైబ్రరీ , అదనపు తరగతి గదులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ రాటబండ గురుప్రసాద్ , ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి , డీఎస్పీ డి.కొండయ్య నాయుడు . అధ్యాపకుడు రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు .

# రక్త సేకరణలో జిల్లా ముందుండాలి

● సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్


రక్త దాతను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

కలికిరి, ఆగస్టు 6: రక్త నిధి నిర్వహణలో జిల్లా ముందుండాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆకాంక్షించారు. వాతావరణ ఒడిదుడుకుల ప్రభావంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జబ్బులు విస్తరిస్తున్న దృష్ట్యా రక్తం అవసరం ఎంతో వుందని ఆయన అన్నారు. రక్తదానంపై అపోహలు తొలగించుకోవాలని, యువత రక్త దానం చేయడానికి ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. విద్యార్థులంతా రక్త దానానికి సహకరిస్తే రక్త కొరత లేని జిల్లాగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ప్రారంభించారు. రక్త దానం కోసం ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. తరచూ ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేసి రక్త సేకరణకు పూర్తి సహకారాలు అందజేస్తామని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర రావు హామీ ఇచ్చారు. విద్యార్థులు టాటూలకు దూరంగా వుంటేనే రక్త దానానికి అవకాశముంటుందని చెప్పారు. రక్త దాతలు ప్రాణ దాతలుగా అభివర్ణించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అపర్ణ, జిల్లా రెడ్ క్రాస్ అధికారి రాజశేఖర్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ సనా ఆయేషా, ప్రొఫెసర్ రంగజనార్దన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు రేవతి, కేశవకుమార్, నూర్ మహ్మద్, ప్రవీణ్, రజని, డిస్పెన్సరీ సిబ్బంది లావణ్య, చాంద్ బాషా పాల్గొన్నారు.

**కేజీబీవీలో విచారణ**

**కురబలకోట:** కురబలకోట మండలం ముదివేడు క్రాస్ సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినుల ఆత్మహత్యాయత్నంపై మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ విచారణ చేశారు. గత నెల 18న పాఠశాలలో 9వ చదువుతున్న విద్యార్థినులు పారసిటమాల్ మాత్రలను మింగి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించారు. ఈ సంఘటనపై ఆయన పాఠశాలకు వెళ్ళి విద్యార్థినులు, అధ్యాపక సిబ్బందిని వేర్వేరుగా విచారణ చేశారు. అనంతరం కురబలకోట కార్యా లయంలో తనిఖీ చేశారు. రికార్డు రూమును పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు.

# మీడియా ముసుగులో సెటిల్మెంట్లు చేస్తే.. ఖబడ్దార్!

● డీఎస్పీ కొండయ్యనాయుడు



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె టౌన్, ఆగస్టు 6: మీడియా ముసుగులో పోలీసుస్టేషన్‌ల వద్ద కొందరు సెటిల్మెంట్లు చేస్తున్నట్లు తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటివారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు హెచ్చరించారు. మంగళ వారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొంత మంది పోలీసు స్టేషన్ల వద్ద ఉదయం నుంచి కాపుకాసి ఫిర్యాదు చేసేందుకు వస్తున్న బాధితులను ఏమార్చి సెటిల్‌మెంట్లు చేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలను సహించబోమని, ఈ విషయమై అన్ని పోలీసు స్టేషన్ల సీఐలకు, ఎస్‌ఐలకు సూచనలు ఇస్తామన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులకు భూదందాలు, కబ్జాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై రెవెన్యూ అధికారులు తమకు రెఫర్ చేసినా, బాధితులే సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసులు కట్టి విచారిస్తామన్నారు. గంజాయి సరఫరాదారులు, వినియోగదారులను గుర్తించి గంజాయి చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం ఒక హెడ్‌కానిస్టేబుల్, ఆరుగురు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ విషయమై అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, వారపు సంత జరిగే మంగళవారం రోజున ఇతర స్టేషన్‌ల నుంచి కానిస్టేబుళ్లను డిప్యుటేషన్ తీసుకుని ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. భోజనం హోటళ్లు, రద్దీగా వున్న ప్రాంతాల్లో కారు పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగచేస్తే చర్యలు ఎదుర్కోవాల్సి వుంటుందన్నారు. ఆటోలు కూడా ఎక్కడ పడితే అక్కడ ప్యాసింజర్లను ఎక్కించుకోరాద న్నారు. బెంగళూరు బస్టాండు, చిత్తూరు బస్టాండు నుంచి బయలు దేరే ప్రైవేటు బస్సులు నడిరోడ్డుపై ఆపకుండా చర్యలు తీసుకుంటామన్నారు. లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఇళ్లలో దొంగతనాలు నివారించడానికి ప్రయత్నిస్తామని, రాత్రి పూట బీట్లు కూడా పెంచుతామన్నారు. ప్రతి ఒక్కరికి ఫ్రెండ్లీ పోలీసింగ్ ఇవ్వడమే తమ ధ్యేయమన్నారు.

**దుర్వ్యసనాలతో ఆరోగ్యం, భవిష్యత్ నాశనం చేసుకోవద్దు**

దుర్వ్యసనాలతో విద్యార్థులు వారి ఆరోగ్యం, భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ సూచించారు. స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో తాలూకా సీఐ శేఖర్ ఆధ్వర్యంలో యాంటి డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కొంత మంది యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాడు పడి గొడవలకు దిగుతున్నారని, దీని వలన నేరం చేసిన వారిని జైలుకు పంపక తప్పదన్నారు. విద్యార్థులు, యువత తల్లిదండ్రులకు బాధ కలిగించే ఇలాంటి వాటి జోలికి వెళ్లవద్దని సూచించారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, ర్యాగింగ్‌ను ప్రోత్సహించే వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డ్రగ్స్ జోలికి వెళ్లమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

పెద్దతిప్పసముద్రం అగస్టు 6 : వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కొండయ్య సూచించారు. మంగళవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు, ఆసుపత్రి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి గ్రామాల్లో పౌష్టికాహారంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న ల్యాబ్ భవనాన్ని పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రిలో మందుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏస్దానీ, విజయకుమారి, రెడ్డెప్ప, జనార్దన, శేషాద్రి, లతో పాటు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

**పెద్దమండ్యం:** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పెద్దమండ్యం పీహెచ్‌సీ డాక్టర్ ఇమ్మాన్యుయేల్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆయన ఆశ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల లో ప్రజల ఆరోగ్య పరిస్థితిని ఆశ సిబ్బంది వైద్యాధికారులకు తెలియజేయాలన్నారు. విష జ్వరాలు సోకిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించాలన్నారు. గర్భిణులకు టీకాల ప్రాధాన్యం తెలియజేయాలన్నారు. ఈ నెల 20న నులి పురుగుల నివారణ దినోత్సవం విజయవంతం చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందుల పంపిణీపై ఆశ సిబ్బంది దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల వివరాలు కూడ తెలియజేయాలన్నారు. ప్రధానంగా గర్భిణుల వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన చోట ఉచిత వైద్య శిబిరాల అవశ్యకత తెలియజేయాలన్నారు. సీహెచ్‌వో కృష్ణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే శిశు మరణాల నివారణ

పీలేరు, ఆగస్టు 6: తల్లిపాలతో శిశు మరణాలను నివారించగలమని పీలేరు ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి తెలిపారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తలపుల గ్రామంలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పుట్టిన అర గంటలోపు పట్టే ముర్రుపాలు శిశువు సర్వతోముఖాభివృద్ధికి ఎంతో ఉపయోగపడ తాయన్నారు. శిశువు, మేధస్సు జ్ఞాపకశక్తి, తెలివితేటలు వంటి అనేక అంశాలకు అంకురార్పణ ముర్రుపాలతోనే కలుగుతుందన్నారు. శిశువుకు పాలు పట్టడం ద్వారా తల్లులకు అండాశయ, రొమ్ము క్యాన్సర్లు, రక్తహీనత, ఎముకల బలహీనత, ప్రసవా నంతర రక్తస్రావాలు ఆపవచ్చునన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్, హెచ్ ఈ కొండయ్య, సూపర్‌వైజర్లు కుసుమ, కృష్ణయ్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.

**కలికిరి:** ఐసీడీఎస్ ఆధ్వర్యంలోమేడికుర్తిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పలువురు తల్లులు, గర్భిణులు, మహిళలకు వైద్యాధికారిణి డాక్టర్ కావ్యగంధ తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రెడ్డి సర్తాజ్, ఆరోగ్య పర్యవేక్షకులు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## మదనపల్లె వన్ టౌన్ సీఐగా చాంద్‌బాషా

మదనపల్లె అర్బన్ ఆగష్టు 6: మదనపల్లె వన్‌టౌన్ సీఐగా చాంద్‌బాషా మంగళ వారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అత్యవసరం ఉంటే ఫోన్ ద్వారా తనకు సమస్యలను తెలపవచ్చన్నారు..

## ఎస్ఎంసీ ఎన్నికలకు దిశా నిర్దేశం

రామసముద్రం, ఆగస్టు 6: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో ఈ నెల 8వ తేదీన జరగనున్న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎంఈవో హేమలత ప్రధానోపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి శ్యాంప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో మండలంలోని అన్ని పాఠశాలలు ప్రధానోపాధ్యాయులతో మంగళవారం ఎంఈవో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులలో ఒకరు తప్పనిసరిగా మహిళలు ఉండేలా కమిటీలు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి తరగతికి సంబంధించి ముగ్గురు సభ్యులను తల్లిదండ్రులలో ఎంపిక చేసుకుని కమిటీ ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు. కమిటీ ఎన్నికలు సామరస్యంగా సజావుగా జరిగేలా పిల్లల తల్లిదండ్రుల సహకారంతో తీసుకోవాలని ఎంఈవో ఉపాధ్యాయులకు సూచించారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కురబలకోట, ఆగస్టు 6: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రిసోర్సుపర్సన్ సాయిచరణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ రంగంలో మెరుగైన ఉద్యోగవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధానంగా ఎలక్ట్రికల్, విద్యుత్, కంట్రోల్ సిస్టమ్స్, తదితర వాటిపై సాఫ్ట్‌వేర్‌లపై నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్, విభాగాధిపతి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 14న మంగళగిరిలో పీలేరు ఎమ్మెల్యే ఫిర్యాదుల స్వీకరణ

కలికిరి, ఆగస్టు 6: మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలు, నాయకుల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించడానికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డికి ఈ నెల 14వ తేదీని కేటాయించారు. పార్టీ శ్రేణుల సమస్యల పరిష్కారం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతి రోజూ ఫిర్యాదులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ప్రతి రోజు ప్రభుత్వ నుంచి ఒక మంత్రి, పార్టీ వైపు నుంచి ఒక పదవిలో వున్నవారు తప్పని సరిగా హాజరయ్యే విధంగా షెడ్యూలు అమలు చేస్తున్నారు. జిల్లా నుంచి గత నెల మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఒక రోజు పాల్గొనగా ఈ నెలలో 14వ తేదీన కిశోర్‌కుమార్ రెడ్డి హాజరు కానున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో హాజరయ్యే కిశోర్‌కుమార్ రెడ్డితోపాటు సంక్షేమ, సచివాలయాల శాఖ మంత్రి డా. డోలా బాలవీరాంజనేయులు కూడా అందుబాటులో వుంటారు. టీడీపీ కార్యకర్తలు, నాయకుల కోసం మాత్రమే ఈ ఫిర్యాదుల స్వీకరణను నిర్దేశించారు.

**సీఎం చంద్రబాబు కోసమైతే రిజిస్ట్రేషన్ తప్పనిసరి**

కాగా వారంలో ఒక రోజు అంటే ప్రతి శనివారం సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఫిర్యాదుల స్వీకరణకు క్రమం తప్పకుండా హాజరవుతున్న విషయం తెలిసిందే. నేరుగా సీఎంకు వినతిపత్రం లేదా ఫిర్యాదు ఇవ్వదలుచుకుంటే ముందుగానే తమ పేరు నమోదు చేసుకోవాలని పార్టీ కార్యాలయం తెలిపింది. సీఎంకు మాత్రమే వినతిపత్రాలు అందజేయాలనుకునే వారు ముందుగా అంటే గురు, శుక్రవారం సాయంకాలం 5 గంటలలోగా తమ పేరు నమోదు చేసుకోవలసి వుంటుంది. పార్టీ కేంద్ర కార్యాలయంలోని 7306299999 నంబరుకు ఫోను చేసి పేరు రిజిస్టరు చేసుకోవచ్చు. తరువాత శనివారం నాడు సీఎంను కలుసుకోవచ్చు. పేర్లు నమోదు చేసుకోని వారిని మాత్రం అనుమతించరు.

## పక్కా గృహాల నిర్మాణపనులు వేగవంతం చేయండి


పక్కా గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దమండ్యం, ఆగష్టు 6: పక్కా గృహాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పెద్దమండ్యం ఎంపీడీవో వెంకట రమణయ్య, ఈవోఆర్డీ శ్రీధర్‌రావు ఆదేశించారు. మండలంలోని బండమీద పల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి లేఅవుట్‌లో పక్కా గృహాల నిర్మాణ పనులను వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పక్కా గృహ నిర్మాణాలను పూర్తి చేసిన లబ్ధిదారులకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తుందన్నారు. ఇంజనీరు అసిస్టెంట్‌లు బాధ్యత తీసుకొని లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. మంజూరైన ఇళ్లు, పనులు ప్రారంభించిన లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తురకపల్లిలో పక్కా గృహాల నిర్మాణాలు త్వరలో పూర్తి చేయిస్తామని ఇంజనీరు అసిస్టెంట్‌లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు గుర్తించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. పేద వారి గృహాలను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకునట్లు అధికారులు వెల్లడించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు శైలజ, శేషాద్రి, ఇంజనీరు అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి, జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా గాయకుడికి ఘన నివాళులు


గద్దర్‌కు నివాళులర్పిస్తున్న 'బాస్' శ్రేణులు

పీలేరు, ఆగస్టు 6: ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని మంగళవారం పీలేరులోని భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. స్థానిక బీఆర్ అంబేడ్కర్ కూడలిలో గద్దర్ చిత్రపటాన్ని ఆవిష్కరించి దానికి పూలమాలలు అర్పించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ తన మాటలతో చైతన్యాన్ని, పాటలతో విప్లవాన్ని తెచ్చిన ఘనత గద్దర్‌దేనన్నారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ కలలు కన్న సమసమాజాన్ని సాధించేందుకు తన జీవితాన్ని ధారపోయడమే కాకుండా శరీరంలో బుల్లెట్లు పెట్టుకుని పోరాడిన యోధుడన్నారు. అనంతరం గద్దర్ జీవితంలోని పలు విశేషాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముల్లంగి కృష్ణయ్య, నాగరాజ, మల్లికార్జున, హరినాథ, గురవయ్య, రామకృష్ణ, బాలు, గురునాథ, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలకు వాల్మీకిపురం విద్యార్థులు


స్వాతంత్ర్య దినోత్సవాలకు ఎంపికైన విద్యార్థులు

వాల్మీకిపురం, ఆగస్టు 6: ఈనెల 15న జిల్లా కేంద్రంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాలకు వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం సావిత్రి తెలిపారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి స్కౌట్ విద్యార్థులు సంతోష్‌రెడ్డి, ఉదయ్‌చరణ్‌లు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొననునారు. వీరిద్దరూ ఈనెల 7 నుంచి 14 వరకు శిక్షణ పొందనున్నారు. స్కౌట్ మాస్టర్ రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## ఫైళ్ల దహనం కేసులో నిందితులను అరెస్టు చేయాలి


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 6: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యా లయంలో ఫైళ్ల దహనం కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రెడ్డి సాహెబ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్‌పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర వున్న మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్లను కుట్రపూరితంగా దహనం చేశారని డీజీపీ చెప్పిన విషయం తెలిసిందే అన్నారు. ఈ ఘటనలో ముగ్గురు రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేశారని, అలాగే పలువురిపై కేసులు నమోదు చేశారన్నారు. ఘటన జరిగి 15 రోజులవుతున్నా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని ఈ ఘటన వెనుక వున్న సూత్రధారులను కూడా గుర్తించి, నిర్ధారించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టరేట్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముబారక్‌ఖాన్, ఖాదర్‌బాషా, మీనాకుమారి, సోమశేఖర్, నాగరాజ, మహబూబ్‌పీర్, శరత్‌కుమార్‌రెడ్డి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి


వాటర్‌ట్యాంకును ప్రారంభిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

కురబలకోట, ఆగస్టు 6: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తెట్టు జడ్పీహైస్కూల్‌కు చెందిన ఆయన రూ.20వేలతో నిర్మించిన వాటర్‌ట్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయసహకారాలు అందివ్వాలని కోరారు. ఎంఈవో ద్వారకనాథ్ కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవి పాల్గొన్నారు.

## ఆరుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు

మదనపల్లె అర్బన్, ఆగస్టు6: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ ఎన్ శేఖర్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు స్థానిక మోతీనగర్‌లోని ఆమె భర్త నూర్ అహమ్మద్ తోపాటు అత్తవారి కుటుంబసభ్యులు వరకట్నం కోసం కొంత కాలంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ మదనపల్లె మండలం, కొత్తయిండ్లు రంగారెడ్డి కాలనీకి చెందిన పఠాన్ నజియా సుల్తానా(35) తాలూకా పోలీసులను ఆశ్రయించింది. తన భర్త ఆటోమొబైల్ షాపులో పని చేస్తున్నాడని , అధనంగా లక్ష రూపాయలు కట్నం తేవాలని హింసకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు సోమవారం ఫిర్యాదు చేయగా విచారణ చేసి భర్త నూర్ అహమ్మద్, అత్త జరీనా, ఆడపడుచులు నస్రీంతాజ్, మేరినా తాజ్, రోహిణీ తాజ్, అవ్వ జమ్రుద్దీన్‌బీపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## హత్య కేసులో ముగ్గురికి రిమాండ్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6: యువతిని కొట్టి హత్య చేసిన కేసులో ముగ్గురిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ శేఖర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు గత నెల 24వ తేదీన నీరుగట్టువారిపల్లె సమీపంలోని బాబుకాలనీకి చెందిన తన కూతురిని అత్తింటివారు హత్య చేశారని మృతురాలు సాయిప్రియాంక అమ్మ ఫిర్యాదు చేయడంతో తాలూకా పోలీసుల కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం అత్తింటి వారైన భర్త మణికంఠ, అత్త ఉషారాణి, మామ శ్రీనివాసులను రిమాండ్‌కు తరలించామని తాలుకా సీఐ చెప్పారు.